


ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 11 ఏప్రిల్ 2025



దుమ్ముగూడెం వద్ద అడుగంటిన గోదావరి నది

ఏజెన్సీకి తాగునీటి గండం

వేసవి ప్రారంభంలోనే అడుగంటుతున్న గోదావరి

- ఆందోళనలో పరివాహక ప్రాంత ప్రజలు
- పర్ణశాల 'మిషన్ భగీరథ' ఇన్‌టేక్ వెల్ వద్ద తగ్గిన నీటి నిల్వ
- చర్ల, దుమ్ముగూడెం మండలాలకు పొంచివున్న తాగునీటి కష్టాలు
- ఇతర ప్రాంతాలకు నీటి తరలింపుపై విమర్శలు
- ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారుల దృష్టి

దుమ్ముగూడెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే జీవనది గోదావరి నీరులేక వెలవెలబోతోంది. వరదల సమయంలో నిండుకుండను తలపించే గోదావరి... ఈ ఏడాది పూర్తి నిర్జీవంగా మారింది. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా గోదావరి ప్రవాహం అడుగంటడంతో పరీవాహక ప్రాంత ప్రజలకు తాగునీటి కష్టాలు పొంచి ఉన్నాయి. ఈ వేసవిలో మిషన్ భగీరథ ద్వారా దుమ్ముగూడెం, చర్ల మండలాలకు తాగునీటి సరఫరా కష్టమనే వాదనలు వినిపిస్తున్నాయి. మరో పది, పదిహేను రోజులు మాత్రమే గోదావరిలో నీరు ప్రవహించే అవకాశం ఉండగా పర్ణశాల మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ వద్ద నీటినిల్వ తగ్గిపోయి మేలో తాగునీటి సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఎగువ నుంచి నీటిని తీసుకు రావాలన్నా సమ్మక్క బ్యారేజి వద్ద కూడా తగినంత నీటి నిల్వ లేదని తెలుస్తోంది. దీంతో ఈ వేసవి సీజన్‌లో భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాలకు తాగునీటి కష్టాలు తప్పేలా లేవు.

ఇతర ప్రాంతాలకు నీటి తరలింపు

గోదావరి పరివాహక ప్రాంతాలకు కనీస తాగునీటికి నిల్వలు లేకుండా ఇతర ప్రాంతాల్లో సాగునీటి అవసరాలకు నీటి తరలింపుపై స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. గతనెలలో గోదావరి ఎగువన సమ్మక్క బ్యారేజీ నుంచి 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించి సీతారామ పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోసి సాగర్ ఆయకట్టుకు తరలించడంతో స్థానిక అవసరాలు తీర్చకుండా మరో ప్రాంతంలో సాగు అవసరాలకు నీటిని తరలించడాన్ని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు ఆక్షేపిస్తున్నారు. చివరి అవకాశంగా తాలిపేరు ప్రాజెక్టులో ఉన్న మిగులు నీటినైనా గోదావరికి వదిలితే కొంత మేరైనా తాగునీటి అవసరాలు తీరతాయని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తగ్గుతున్న ప్రవాహం..

దుమ్ముగూడెం మండలంలో వంద గ్రామాలు, చర్ల మండలంలో 87 గ్రామాలకు పర్ణశాల మిషన్ భగీరథ ప్లాంట్ నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. కాగా ప్రస్తుతం పర్ణశాల ఇన్‌టేక్ వెల్ వద్ద ప్రవాహం రోజురోజుకూ తగ్గుతుండడంతో భవిష్యత్ సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. దీంతో రెండు మండలాల ప్రజలు, పశువులకు గడ్డు పరిస్థితి ఎదురు కానుంది. దుమ్ముగూడెం ప్రధాన, బ్రాంచి ఆనకట్టల (మిగతా 6వ పేజీలో)

టెన్త్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వ్యాల్యుయేషన్) నిర్వహణలో విద్యాశాఖ అధికారులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. వ్యాల్యుయేషన్ కోసం ఉపాధ్యాయులను కేటాయించడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల అనేక లోపాలు బయటపడుతున్నాయి. పైగా తమ తప్పులను కప్పి పుచ్చుకునేందుకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.



ఇష్టారాజ్యంగా 'స్పాట్'

టెన్త్ మూల్యాంకనంలో విద్యాశాఖ అధికారుల బాధ్యతారాహిత్యం

- ఉద్యోగ విరమణ పొందిన వ్యక్తికి స్పాట్ డ్యూటీ
- పైగా విధులకు ఎందుకు రాలేదంటూ షోకాజ్
- ప్రత్యామ్నాయ టీచర్లను కేటాయించిన వారికి కూడా...
- ఆలస్యంగా విధుల్లో చేరిన వారినీ వదలని వైనం
- ప్రహసనంగా మారిన షోకాజ్ నోటీసుల జారీ వ్యవహారం

ఖమ్మం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి స్పాట్ వ్యాల్యుయేషన్‌కు హాజరుకాలేదంటూ జిల్లా విద్యాశాఖ అధికారులు బుధవారం 63 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే అసలు స్పాట్ వ్యాల్యుయేషన్ కోసం ఉపాధ్యాయులను కేటాయించే సమయంలోనే అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగ విరమణ పొందిన ఓ ఉపాధ్యాయుడికి స్పాట్‌లో విధులు కేటాయించడం, పైగా ఆయన విధులకు రాలేదంటూ షోకాజ్ నోటీసు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఖమ్మంలోని పుట్టకోట జడ్పీహెచ్‌ఎస్‌లో సీహెచ్.నాగేశ్వరరావు అనే ఉపాధ్యాయుడు మ్యాథ్స్ టీచర్‌గా పనిచేస్తూ మూడు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందాడు. అయినప్పటికీ ఆయనకు స్పాట్ విధులు కేటాయించారు. పైగా స్పాట్ విధులకు హాజరుకాలేదంటూ 63మందికి ఇచ్చిన షోకాజ్ నోటీసుల్లో ఆయన కూడా ఉన్నారు. ఇది విద్యాశాఖ అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

ప్రత్యామ్నాయ టీచర్లు...

స్పాట్ కేటాయించిన సమయంలోనే జిల్లా పరిధిలో కొందరు అనారోగ్యం రీత్యా, మరికొందరు కుటుంబ సమస్యల కారణంగా విధులకు హాజరుకాలేమనీ, తమ ఆర్డర్లను రద్దు చేయాలంటూ వినతిపత్రాలు సమర్పించారు. అయితే ప్రత్యామ్నాయంగా మరో ఉపాధ్యాయుడు విధులకు హాజరయ్యేలా చూస్తే ఆర్డరు రద్దు చేస్తామని అధికారులు చెప్పడంతో, చాలామంది తమకు బదులుగా వేరొకరిని ప్రత్యామ్నాయంగా చూపించారు. అయితే బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారులు 'స్పాట్ విధులకు ఎందుకు హాజరు కావడం లేదు..?' అని పలువురు టీచర్లకు నోటీసులు జారీ చేశారు. అసలు విషయం ఏమిటంటే ప్రత్యామ్నాయంగా ఆయా ఉపాధ్యాయులు చూపించిన వారు స్పాట్‌కు హాజరవుతూనే ఉన్నారు.

ఉదాహరణకు సత్తుపల్లి మండలంలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు అనారోగ్య కారణాల రీత్యా స్పాట్‌కు హాజరు కాలేకపోతున్నాననీ, తన స్థానంలో పాల్వంచలో ఓ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు హాజరవుతాడని వినతి పెట్టుకోగా... సదరు ఉపాధ్యాయుడికి స్పాట్‌లో విధులు కేటాయించారు. కానీ మొదట విధులు కేటాయించిన సత్తుపల్లికి చెందిన ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అయితే వాస్తవానికి ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిని చూపించిన సమయంలో తొలుత ఉన్న (మిగతా 6వ పేజీలో)



బోదులబండలో ధాన్యం రాశిని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

తరుగు తీస్తే చర్యలు తప్పవు...

- రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదు...
- తెచ్చిన ధాన్యాన్ని 48 గంటల్లో కొనుగోలు చేయాలి
- దళారులను నమ్మొద్దు..
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

8

భవిష్యత్తంతా ఫుడ్ ప్రాసెసింగ్‌దే..

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి
- బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్క్‌ను అభివృద్ధి చేయాలి
- ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంట విలువ పెరుగుతుంది
- సమీక్షలో మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు

ఖమ్మం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, భవిష్యత్తంతా ఫుడ్ ప్రాసెసింగ్ రంగానిదేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఆహార ప్రాసెసింగ్ రంగంపై టీఎస్ఐసీ సీఈవో టి.మధుసూదన్, ఫుడ్‌ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్‌తో కలిసి హైదరాబాద్‌లో గురువారం సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ అభివృద్ధికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సకల సౌకర్యాలకు బుగ్గపాడు మెగాఫుడ్ పార్క్ అనుకూలమన్నారు. అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి కంపెనీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించి, అన్ని అవకాశాలు కల్పించాలన్నారు. రవాణా పరంగా బుగ్గపాడుకు ఉన్న వసతులు ఎక్కడా లేవన్నారు. ఖమ్మం నుంచి రాజమండ్రి వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే ఉందన్నారు.

అత్యధిక దిగుబడులు సాధించే రైతాంగం తెలంగాణకు ఉందన్నారు. విజయవాడ, మచిలీపట్నం పోర్టులు అతిసమీపంలో ఉన్నాయని వివరించారు.ఖమ్మం జిల్లాలో విరివిగా లభించే మామిడి, కోకో, ఆయిల్ పామ్, కొబ్బరి వంటి తోటల పంటల ప్రాసెసింగ్‌కు పార్క్ వసతులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. అత్యధిక స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఆయా పంటలను ఫుడ్ ప్రాసెసింగ్ చేసే అవకాశం కల్పిస్తే ఆయా పంటలకు విలువ పెరిగి రైతులకు సిరుల పంట కురుస్తుందన్నారు.

- తెలంగాణలో ప్రధానంగా ఖమ్మం జిల్లాలో మామిడి, కొబ్బరి, ఆయిల్ పామ్, కోకో పంటలు విరివిగా పండించే రైతాంగం ఉందన్నారు. ఫుడ్‌పార్క్‌ను అభివృద్ధి చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్, గ్రీన్ ఫీల్డ్ హైవే, విజయవాడ, మచిలీపట్నం పోర్ట్‌కు సమీపంలో రవాణాలకు అనుకూలమైన ప్రదేశంలో ఉందని, రవాణాకు లోటు లేదన్నారు.

ముడిసరుకులు ఎక్కువగా అందుబాటులో ఉన్నాయని, రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులను ఆకర్షించడంలో మెగా ఫుడ్ పార్క్ విఫలమవుతోందని తక్షణమే నిర్లక్ష్యం వీడాలన్నారు. ధరలు ఎక్కువగా ఉండటం వల్ల పెట్టుబడిదారులను ఆకర్షించడంలో విఫలమవుతున్నట్టు మంత్రుల దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. అయితే ధరలను పునఃసమీక్ష చేసి, పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యూనిట్లు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వపరంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రులు ఆదేశించారు.



తెట్టెలపాడులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం

- గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో లూటీ
- ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సంక్షేమ పథకాలు అందిస్తాం
- రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఎన్ని కష్టాలు వచ్చినా నిలబెట్టుకుంటామని, గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇస్లావత్‌తండా, మేడిదపల్లి, ఏలువారిగూడెం, తెట్టెలపాడు గ్రామాల్లో సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అలాగే తిరుమలాయపాలెంలో నూతనంగా చేపట్టిన పీఏసీఎస్ భవనం పిండిప్రోలులో నూతనంగా చేపట్టిన పీఏసీఎస్ గోడౌన్‌ను, షాపింగ్ కాంప్లెక్స్ ఆయన ప్రారంభించారు.

అనంతరం తిరుమలాయపాలెంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేనప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామిని అమలుచేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికి 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మొదట విడతగా 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేసిందన్నారు. గతేడాది సెప్టెంబరులో కురిసిన భారీవర్షంతో నాలుగు మండలాల్లో ప్రజలకు తీవ్రనష్టం (మిగతా 6వ పేజీలో)

కామాంధుడికి జీవితఖైదు

- పోక్సో కేసులో తీర్పు ప్రకటించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి
- పోలీసులను, లీగల్ బృందాన్ని అభినందించిన ఎస్పీ

కొత్తగూడెం లీగల్/ఇల్లెందు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ముద్దాయికి జీవితఖైదు విధిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయాధికారి పాటిల్ వసంత్ గురువారం తీర్పు వెల్లడించారు. కేసు వివరాలిలా ఉన్నాయి.. ఇల్లెందు మండలం తంగెళ్లగడ్డకు చెందిన భూక్య నాగేశ్వరరావు అలియాస్ నగేష్.. తన బంధువు కుమార్తెలు అయిన ఆరేళ్ల, నాలుగేళ్ల బాలికలకు చాక్లెట్ ఇస్తానని చెప్పి గతేడాది జూలై 4న తన ఇంట్లోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అయితే బాలికలు కేకలు వేయడంతో నాగేశ్వరరావు పారిపోయాడు. ఈ విషయమై బాలిక తండ్రి జూలై 5న ఇల్లెందు పోలీసులకు (మిగతా 6వ పేజీలో)

లారీ వదిలేందుకు లంచం తీసుకున్నారని..

భద్రాచలం సీఐ రమేశ్, గన్‌మన్ రామారావు, మరో వ్యక్తి అరెస్టు



పట్టుబడ్డ సీఐ, గన్‌మన్, ప్రైవేటు వ్యక్తి కార్తీక్ (రౌండప్)

- సంచలనం సృష్టించిన ఏసీబీ అధికారుల చర్య
- 20 రోజుల క్రితం అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ పట్టుబడ్డ లారీ
- దాన్ని విడిచిపెట్టేందుకు రూ.20వేల లంచం డిమాండ్
- ఓ ప్రైవేటు వ్యక్తికి ఫోన్‌పే ద్వారా చెల్లింపు
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- పక్కా ఆధారాలతో సీఐని, గన్‌మన్‌ని అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు

భద్రాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా గ్రావెల్ (మొరం) తరలిస్తూ పట్టుబడ్డ ఓ లారీని వదిలిపెట్టేందుకు రూ.20 వేలు లంచం తీసుకున్న ఘటనలో భద్రాచలం సీఐ బరపాటి రమేష్‌తో పాటు అతడి గన్‌మన్ రామారావును గురువారం ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 19న భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం నుంచి భద్రాచలానికి గ్రావెల్ తరలిస్తున్న ఓ లారీని భద్రాచలం వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఆ లారీని పోలీసుస్టేషన్‌కు తరలించి లారీ ఓనర్‌ను పిలిపించారు. అయితే ఆ గ్రావెల్‌ను తాము ఇంటి నిర్మాణం కోసం తరలిస్తున్నామని సదరు లారీ ఓనర్ చెప్పాడు. అయినా అనుమతి లేకుండా గ్రావెల్ తరలించకూడదని, అందువల్ల కేసు నమోదు చేస్తామని భద్రాచలం సీఐ బరపాటి రమేష్ తెలిపారు.

ఈ వ్యవహారంలో మధ్యవర్తిత్వం వహించిన సీఐ గన్‌మన్ రామారావు రూ.30వేలు ఇస్తే సీఐ లారీని వదిలిపెడతారని సదరు లారీ ఓనర్‌కు తెలిపాడు. అయితే తాను అంత మొత్తం చెల్లించలేనని, కావాలంటే కేసు పెట్టుకోండని లారీ ఓనర్ చెప్పడంతో గన్‌మన్ మళ్లీ సీఐతో మాట్లాడి చివరికి రూ.20 వేలు చెల్లించాలని సూచించాడు. ఆ నగదును కూడా నేరుగా సీఐకి ఇవ్వకుండా గన్‌మన్ రామారావు సూచించిన దారా కార్తీక్ అనే వ్యక్తికి ఫోన్‌పే ద్వారా చెల్లించడంతో లారీని విడుదల చేశారు.

అయితే సదరు లారీ ఓనర్ ఈ వ్యవహారంపై ఏసీబీని ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు గురువారం ఆకస్మికంగా భద్రాచలం పట్టణ పోలీసుస్టేషన్‌పై (మిగతా 6వ పేజీలో)

32 స్లాట్లు.. 31 రిజిస్ట్రేషన్లు..

- రిజిస్ట్రేషన్ నూతన విధానం తొలిరోజు పరిస్థితి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత వేగిరం చేసేందుకు రూపొందించిన నూతన విధానం గురువారం ఖమ్మం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులోకి వచ్చింది. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 19 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఎంపిక చేయగా.. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, కూసుమంచిని ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో నూతన విధానంలో ఖమ్మంలో తొలిరోజు 32 స్లాట్లు బుక్ అవ్వగా 31 రిజిస్ట్రేషన్లు నిర్వహించారు. అయితే ఈ విధానంలో ముందుగా వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. సేల్‌డీడ్, గిఫ్ట్‌డీడ్, మార్టిగేజ్‌లకు అవకాశం ఉండగా.. తాజాగా జీపీఏ, లీజు, వీలునామా (మిగతా 6వ పేజీలో)

జో అచ్చుతానంద...

జోజో ముకుందా...

- కల్యాణ రాముడికి వైభవంగా ఊంజల్ సేవ
- రేపటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. స్థానిక నిత్యకల్యాణ మండప వేదిక వద్ద ప్రత్యేకంగా ఉయ్యాలను ఏర్పాటు చేసి ఆవాహన చేశారు. అనంతరం శ్రీసీతారామచంద్ర లక్ష్మణ స్వాములను ఉయ్యాల్లో ఆసీనులను చేసి భక్త రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను దేవస్థానం హరిదాసులు ఆలపించారు. ఇదే సమయంలో ప్రత్యేక హారతులు సైతం స్వామివారికి సమర్పించారు. అనంతరం సింహ వాహనంపై శ్రీసీతారామచంద్ర స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించారు.

రేపటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామికి శుక్రవారం వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కల్యాణం జరిగిన తరువాత బ్రహ్మోత్సవాల్లో భాగంగా వసంతోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. కాగా స్వామివారు సాయంత్రం గజ వాహనంలో తిరువీధి సేవకు తరలివెళ్లనున్నారు. శనివారం చక్రతీర్థం, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించి ధ్వజ అవరోహణం, ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించనున్నారు. శ్రీపుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి. కాగా 13నుంచి నిత్యకల్యాణాలు పునరుద్ధరించనున్నారు.

తెరుచుకున్న మెప్మా పీడీ కార్యాలయం



పీడీ కార్యాలయం శుభ్రం చేస్తున్న మెప్మా సిబ్బంది

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు నెల రోజుల తర్వాత ఖమ్మం జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం తలుపులు తెరుచుకున్నాయి. ఖమ్మం నగర పాలక సంస్థ నిర్వహణ సిబ్బంది పీడీ కార్యాలయం తలుపులు తీసి శుభ్రం చేశారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'సార్ మళ్లీ వస్తారా..' కథనంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. దీంతో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం తలుపులు తీసి సిద్ధం చేశారు.

యర్రా శ్రీకాంత్ కుటుంబానికి

మంత్రి పొంగులేటి పరామర్శ



శ్రీకాంత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ కుటుంబ సభ్యులను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. బుధవారం ఖమ్మం లోని యర్రా శ్రీకాంత్ నివాసానికి మంత్రి వెళ్లారు. యర్రా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

32 స్లాట్లు...

31 రిజిస్ట్రేషన్లు...

(5వ పేజీ తరువాయి)

డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు కూడా ముందస్తుగానే స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఖమ్మం సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో ఇద్దరు రిజిస్ట్రార్లు ఉండడంతో ఇక్కడ 96 స్లాట్లు బుక్ చేసుకునే ఆస్కారం ఉంటుంది. అయితే తొలిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు 31 రిజిస్ట్రేషన్లు చేయగా సాయంత్రం సాంకేతిక ఇబ్బందులు, ఇతరత్రా కారణాలతో నిలిచిపోయిన మరో 6 రిజిస్ట్రేషన్లను నిర్వహించినట్టు కార్యాలయం అధికారులు తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్ విధానంలో ప్రస్తుతం రెయిల్‌టెల్ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నారు. అయితే తొలి రోజు ఎలాంటి సమస్యలు తలెత్తలేదని తెలిపారు.

ఇష్టారాజ్యంగా 'స్పాట్'

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయుడి ఆర్డరు రద్దు చేసి ఆ స్థానంలో మరో ఉపాధ్యాయుడిని నియమిస్తున్నట్టు ఆర్డరు కాపీ ఇవ్వాల్సి ఉండగా.. జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం తొలుత ఉపాధ్యాయుడి ఆర్డరు కాపీ మీద పేరును పెన్నుతో కొట్టేసి మరో ఉపాధ్యాయుడి పేరు రాయడమే ఇలాంటి పరిస్థితులకు కారణంగా కనిపిస్తోంది. షోకాజ్ నోటీసుల్లో సగానికి పైగా ఈ కోవకు చెందినవేనని ప్రచారం జరుగుతోంది.

ఆలస్యంగా విధుల్లో చేరిన వారికి కూడా..

స్పాట్ వ్యాల్యూయేషన్ విధులు కేటాయించిన వారిలో కొందరు ఆలస్యంగా చేరగా, వారికి సైతం షోకాజ్ నోటీసులు జారీ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు 20మంది ఆలస్యంగా చేరినప్పటికీ వారు విధుల్లో పాల్గొంటున్నారని, వారికి కూడా అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారని తెలిసింది. వీటన్నింటికీ అధికారుల మధ్య సమాచారలోపం స్పష్టంగా కనిపిస్తోంది. అసలు ఎవరెవరు స్పాట్‌లో ఉన్నారు...? రాని వారు ఏయే కారణాలతో హాజరుకాలేదు...? వంటి సమాచారం లేని కారణంగానే నోటీసులు ఇచ్చారన్న వాదన వినిపిస్తోంది. అంతే కాదు కొన్ని పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకే ఎక్కువమందిని స్పాట్‌కు కేటాయించారన్న ఆరోపణలు లేకపోలేదు. ఖమ్మం నగరంలోని ఓ పాఠశాలలో ఎనిమిది మంది ఉపాధ్యాయులకు స్పాట్ విధులు కేటాయించగా, వారు విధులకు హాజరు కావడంలేదని తెలిసింది. అధికారులు టీఏ, డీఏలకు లోబడి విధులు కేటాయిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి టీఏ, డీఏలు ఇవ్వాల్సి వస్తుందని, 8 కిలోమీటర్ల లోపు ఉన్నవారిలోనే ఎక్కువ మందికి విధులు కేటాయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేదల ఆస్పత్రిపై..

పెద్ద మనసేది?



నవజాత శిశు కేంద్రంలో గర్భిణులు, బాలింతల అవస్థలు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాలకు వరప్రదాయినిగా పేరుగాంచిన ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో వేసవితాపం నరకాన్ని చూపిస్తోంది. మాతాశిశు కేంద్రం అటు తల్లులను, ఇటు శిశువులను అవస్థల పాలు చేస్తోంది. మాతాశిశు కేంద్రంలో పడకలు తక్కువగా ఉండడం ప్రతి నిత్యం గర్భిణులు ప్రసవాలకు రావడంతో ఇక్కడున్న సదుపాయాలు సరిపోక నానా అవస్థలు పడుతున్నారు. అప్పుడే పుట్టిన చిన్నారులను సైతం నేలపైనే పడుకోపెట్టాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. ప్రస్తుతం పరీక్షలకు నమోదు చేసుకోవాలంటే చాంతాడంత క్యూలైన్లో నిల్చోవాల్సి వస్తోంది. ఇక వైద్యులతో పరీక్షించుకోవాలన్నా.. గంటల తరబడి నిల్చోవాల్సి వస్తోంది. స్కానింగ్ కోసం వెళ్లాలన్నా.. వరుసలో వంతు కోసం వేచి ఉండాల్సిందే. అంతే కాదు ప్రసవం అవ్వాలన్నా.. బెడ్ ఖాళీ కావాల్సిందే. ఇలాంటి పరిస్థితులున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే గర్భిణులు, వారి బంధువులు వాపోతున్నారు. వార్డుల్లో ఫ్యాన్లు తిరగడం లేదు. ఐసీయూలో ఏసీలు పనిచేయడం లేదు. దీంతో బెడ్లపై గర్భిణులు, బాలింతలు అప్పుడే జన్మించిన నవజాత శిశువులు వేడికి అల్లాడిపోతున్నారు. ఫ్యాన్లు తిరగక, ఉక్కపోతకు నవజాత శిశువులు గుక్కపట్టి ఏడుస్తున్నారు. గర్భిణులకు, బాలింతలకు సహాయకులుగా వచ్చిన మహిళలకు, బంధువులకు కనీసం కూర్చోడానికి కుర్చీలు కూడా లేకపోవడంతో బెడ్లపైనే ఉంటున్నారు. దీని వల్ల పుట్టిన బిడ్డకు ఆపరేషన్ అయిన తల్లికి పరిశుభ్రత లోపించి అస్వస్థతకు గురికావాల్సి వస్తోంది.

- ప్రధానంగామాతాశిశు కేంద్రంలో ప్రస్తుతం జీ ప్లస్ రెండు అంతస్తులున్నాయి. వీటికి అదనంగా మరో అంతస్తును నిర్మిస్తే తప్ప ఈ కేంద్రానికి వచ్చే మహిళలకు ఇక్కట్లు తప్పేలా లేవు. ఈ విషయమై ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు నివేదించినా. అవన్నీ బుట్టదాఖలే అవుతున్నాయి. దీంతో అవస్థలు షరా మామూలే అన్నట్లుంది.
- హైరిస్క్ కేసుల కోసం ఉంచాల్సిన వార్డుల్లో కనీస సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు లేకపోవడంతో దీన్ని వినియోగించలేక పోతున్నారు.
- ఎన్ఐసీయూలో ఫొటో థెరపీలోనూ అగచాట్లే పడుతున్నారు. ఇక్కడ వైద్యుల సంరక్షణ ఉండాల్సి ఉండగా అంతంతమాత్రంగానే ఉంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.
- చిన్నపిల్లల ఓపీ కూడా రోజుకు 100 నుంచి 150 వరకు వస్తున్నా వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఆరోపిస్తున్నారు. ఫ్యామిలీ ప్లానింగ్, ఏఎంసీ, ఎన్నార్సీ, పీఐసీయూ, ఎస్ఎన్‌సీయూ, వార్డుల్లోనూ నిర్వహణ లోపిస్తుందని ఫలితంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందంటున్నారు.
- ఎస్ఎన్‌సీయూలో వార్మర్లు మానిటర్లు (హెచ్‌పీఎన్‌సీ) తరచుగా మరమ్మతులకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మరుగుదొడ్లు, వైద్యుల మూత్రశాలల నిర్వహణ కూడా అంతంత మాత్రంగా ఉంటుంది. దీంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితులున్నాయని ఆరోపిస్తున్నారు.
- వార్డుల్లో, విభాగాల్లో ఎక్కడికక్కడ గేట్లు, విభజన చేస్తే తప్ప రద్దీని నియంత్రించడం తద్వారా ఇన్‌ఫెక్షన్ రాకుండా తల్లీబిడ్డలను సంరక్షించే ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికైనా మాతాశిశు ఆరోగ్య కేంద్రం సమస్యలను పట్టించుకోవాలని కోరుతున్నారు.

బీటీపీఎస్‌లో శాంక్షన్ పోస్టులు

మంజూరు చేయాలి

- జెన్కో సీఎండీకి టీఎస్‌పీఈయూ నాయకుల వినతి

మణుగూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీటీపీఎస్ కర్మాగారంలో శాంక్షన్ పోస్టులు (పదోన్నతులు కల్పించాలి) మంజూరు చేయాలని టీఎస్‌పీఈయూ (తెలంగాణ స్టేట్ పవర్‌ఎంప్లాయిస్ యూనియన్) 1535 నాయకులు జెన్కో సీఎండీ సందీప్ కుమార్, సుల్తానియా కోరారు. గురువారం బీటీపీఎస్ సందర్శనకు వచ్చిన జెన్కో సీఎండీని టీఎస్‌పీఈయూ 1535 రీజినల్ అధ్యక్షుడు వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్డీ రఫీ కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు శాంక్షన్ పోస్టులను మంజూరు చేస్తే ప్రస్తుతం పనిచేస్తున్న పలువురు కార్మికులకు ప్రమోషన్లు లభిస్తాయన్నారు. ప్రమోషన్లు లేక పదిహేను ఏళ్లుగా కార్మికులు ఒకే కేడర్లో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్మాగారంలో డ్రైవర్లు, లోకో ఆపరేటర్లు, క్రేన్ ఆపరేటర్ల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. కర్మాగారంలో భూనిర్వాసితులు ఉద్యోగాల్లో చేరే సమయంలో కొందరి విద్యార్హత తప్పుగా నమోదైందని విద్యార్హతకు అనుగుణంగా ఉండే డిసిగ్నేషన్‌తో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జార్జ్, జాన్‌రెడ్డి, సురేష్, రవి చంద్ర, సాయిబాబా, సునీత పాల్గొన్నారు.

అడవుల అభివృద్ధికి పటిష్ఠ చర్యలు

- హద్దులు దాటి అటవీ భూములు ఆక్రమించుకుంటే కేసులు : డీఎఫ్‌వో కృష్ణగౌడ్



ప్లాంటేషన్ ప్రదేశాన్ని పలిశీలిస్తున్న డీఎఫ్‌వో కృష్ణగౌడ్

చంద్రుగొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అడవులు, అటవీ జంతువుల అభివృద్ధికి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్టు డీఎఫ్‌వో (డిస్ట్రిక్ ఫారెస్ట్ ఆఫీసర్) కృష్ణగౌడ్ తెలిపారు. గురువారం చంద్రుగొండ రేంజ్‌లోని అన్నపురెడ్డిపల్లి, బూరుగూడెం, బెండాలపాడు బీట్ పరిధిలో ప్లాంటేషన్లను, జంతువులకు ఏర్పాటు చేసిన తాగునీటి గుంతలతోపాటు బేస్ స్టేషన్ పరిశీలించారు. బేస్ స్టేషన్ కేంద్రంగా నిరంతరం పర్యవేక్షణ చేయాలని స్థానిక అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. డీఎఫ్‌వో చంద్రుగొండ రేంజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అన్నపురెడ్డిపల్లి పరిధిలో రెండు దశాబ్దాల క్రితం వీఎస్ఎస్ కమిటీల ద్వారా 100 హెక్టార్లలో ఏర్పాటు చేసిన వెదురు ప్లాంటేషన్‌ను నరికి దమ్మపేట మండలం జమీదారుబంజర్‌లో ఫారెస్టు డిపోకు తరలిస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా బూరుగూడెం అటవీ ప్రాంతంలో నూతనంగా ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అటవీ సరిహద్దుల్లో పోడు పట్టాలు పొందిన వారిలో కొందరు హద్దులు దాటి అటవీ భూములను ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఫ్‌డీవో కోటేశ్వరరావు, రేంజ్ అధికారి ఎల్లయ్య పాల్గొన్నారు.

12,13 తేదీల్లో

'మూలం సంతూ'

సేంద్రియ ఉత్పత్తుల మేళా

ఖమ్మం మార్కెట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామభారతి ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో నగరంలోని బ్యాంక్ కాలనీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో 'మూలం సంతూ' సేంద్రియ ఉత్పత్తుల మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కుతుంబాక మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో ఈ మేళాను ప్రతి నెలా మొదటి శని, ఆదివారాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. మేళాలో సేంద్రియ కూరగాయలు, బియ్యం, పండ్లు, పర్యావరణ స్నేహపూర్వక ఉత్పత్తులు, అరకు కాఫీ, శొంఠికాఫీ, దవాచాయ్ మొదలగు ఉత్పత్తులు అమ్మకం ఉంటుందని తెలిపారు. ఆరోగ్యాభిలాషులు ఈ మూలం సంతు మేళాను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఇచ్చిన గన్నీసంచులు తీసుకున్నారు..

ధాన్యం కొనుగోళ్ల ప్రారంభంలోనే వివాదం

వైరా, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు సొసైటీ పరిధిలో రైతులకు ఇచ్చిన గన్నీసంచులను తిరిగి వెనక్కు తీసుకున్న వ్యవహారం వివాదంగా మారింది. గరికపాడు సొసైటీ పరిధిలో రెండు రోజుల నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. ఏఈవో సూచనల మేరకు రైతులకిచ్చిన గన్నీసంచులను సొసైటీ సిబ్బంది వెనక్కు తీసుకోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఈ సంఘటన చోటుచేసుకుంది. గరికపాడులో శీలం అంజిరెడ్డి, బండి హన్మంతరావు మరికొంతమంది రైతులకు బుధవారం ధాన్యం కాంటాకు అవసరమైన గన్నీసంచులను ఏఈవో సూచనల మేరకు సొసైటీ సిబ్బంది ఇచ్చారు. అయితే ధాన్యం కాంటాలకు సంబంధించి తేమశాతం, నాణ్యత ధ్రువీకరణ కూపన్లను ఏఈవో ఇవ్వాల్సి ఉంది. అయితే తన వద్ద కూపన్లు అయిపోవడంతో తర్వాత వాటిని అందజేస్తానని, రైతుల ధాన్యాన్ని కాంటా వేయాలని సొసైటీ సిబ్బందికి వ్యవసాయశాఖ సిబ్బంది సూచించారు. ఇదే సమయంలో ఏడీఏ కరుణశ్రీ ఏఈవో కూపన్లు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యాన్ని కాంటా వేయవద్దని తనను హెచ్చరించినట్టు సొసైటీ సీఈవో రామకృష్ణ చెపుతున్నారు. తనకు తెలియకుండా, ఏఈవో కూపన్ లేకుండా రైతులకు గన్నీసంచులు ఇచ్చిన సొసైటీ సిబ్బందిపై సీఈవో రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో సొసైటీ సిబ్బంది రైతులకిచ్చిన గన్నీసంచులను వెనక్కు తీసుకోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి సొసైటీ సీఈవో రామకృష్ణను ప్రశ్నించగా ఏఈవో కూపన్ లేకుండా రైతుల ధాన్యాన్ని కాంటాలు వేయవద్దని ఏడీఏ స్పష్టమైన ఆదేశాలిచ్చారని తెలిపారు. దీనిపై ఏఈవో కూపన్లు లేకుండానే రైతులకు గన్నీసంచులు ఇవ్వటం గురించి తమ సిబ్బందిని ప్రశ్నించా నని పేర్కొన్నారు. దీంతో తమ సిబ్బంది రైతులకిచ్చిన గన్నీసంచులను వెనక్కు తీసుకు వచ్చారని, ఏఈవో నుంచి కూపన్లు తెప్పించి తిరిగి మళ్లీ రైతులకు గన్నీసంచులు ఇచ్చి ధాన్యం కాంటాలు వేస్తామని చెప్పారు.

ఏజెన్సీకి తాగునీటి గండం

(5వ పేజీ తరువాయి)

వద్ద సీపేజ్ కారణంగా నీరు లీకేజీ జరిగి దిగువ ప్రాంతానికి వృధాగా పోతోంది.

ఇరిగేషన్ నివేదిక

గోదావరిలో నీటి ప్రవాహంపై ఇరిగేషన్ అధికారుల నివేదిక ఆందోళన కలిగిస్తోంది. గోదావరి ప్రధాన ఆనకట్ట రిజర్వాయర్ సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.99 టీఎంసీల నిల్వ ఉంది. ప్రధాన ఆనకట్ట ఎగువన హెవీవాటర్ ప్రాజెక్టు, బీటీపీఎస్, సింగరేణి కాలరీస్, మిషన్‌భగీరథ పథకాల కోసం రోజూ 0.012 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నారు. దీంతో గోదావరి ప్రధాన ఆనకట్ట ఎగువన కుమ్మరిగూడెం ఇన్‌టెక్ వెల్ వద్ద 20నుంచి 25రోజుల వరకు మాత్రమే సరిపడా నీటి నిల్వలున్నట్లు ఇరిగేషన్ అధికారులు ఈనెల 8న నివేదిక ఇచ్చారు. దాంతో ఏజెన్సీకి తాగునీటి సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

పిల్లకాల్వలా గోదావరి

గతంలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్‌లోనే దుమ్ముగూడెం బ్రాంచి ఆనకట్ట ఎగువన గోదావరి ప్రవాహం అడుగంటింది. నదికు ఇరువైపులా ఒడ్డు తేలి రాళ్లు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. హెడ్‌లాకుల వద్ద కాల్వలో సుమారు ఇరవై అడుగుల లోతుండే నదీ ప్రవాహం ప్రస్తుతం పిల్లకాల్వను తలపిస్తోంది. దీంతో గోదావరి నుంచి లంక ప్రాంతాలకు జనం నడిచి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే మే నెల పరిస్థితి ఏంటని పరివాహక ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నావిగేషన్ కాల్వ ఆధారంగా వందల ఎకరాల్లో రైతులు మిర్చి, వరి సాగుచేస్తుండగా ప్రస్తుతం వారికి సాగునీరందడం కష్టంగా మారింది. మరో పదిరోజుల పాటు నీరందితేనే పంటలు చేతికొస్తాయని, లేకపోతే ఎండిపోతాయని ఆందోళన చెందుతున్నారు.



పర్ణశాల ఇన్‌టేక్‌వెల్ వద్ద నీటి నిల్వ

ప్రత్యామ్నాయం పరిశీలిస్తున్నాం

- జాన్, మిషన్‌భగీరథ గ్రిడ్ ఏఈ

ప్రస్తుతం పర్ణశాల మిషన్ భగీరథ ఇన్‌టెక్‌వెల్ వద్ద గోదావరి ప్రవాహం బాగా తగ్గింది. ప్రతీ సంవత్సరంలానే ఇన్‌టెక్ వెల్ వద్దకు ట్రెంచి తీయించడంతో నీటి సరఫరా పెరిగే అవకాశం ఉంది. తాగునీటి సరఫరా కోసం అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నాం. ప్రస్తుత గడ్డు పరిస్థితిపై ఉన్నతాధికారులకు ఇప్పటికే సమాచారం అందించాం.

కామాంధుడికి

జీవితఖైదు

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదు చేయగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేశారు. అప్పుడు ఇల్లెందు ఇన్‌చార్జి డీఎస్పీగా ఉన్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ విచారణ చేపట్టారు. అనంతరం రెగ్యులర్ డీఎస్పీగా వచ్చిన చంద్రభాను.. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

ప్రాసిక్యూషన్ తరపున 15 మంది సాక్షులను విచారించారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం జడ్జి పాటిల్ వసంత్ తీర్పును ప్రకటించారు. ముద్దాయి భూక్య నగేష్ అలియాస్ నాగేశ్వరరావుపై నేరం రుజువైనందున జీవితఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. కాగా, ఈ కేసులో నిందితుడికి శిక్షపడే విధంగా కృషి చేసిన కొత్తగూడెం, ఇల్లెందు డీఎస్పీలు రెహమాన్, చంద్రభాను, ఇల్లెందు సీఐ సత్యనారాయణ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మి, భరోసా సెంటరు కొత్తగూడెం లీగల్ ఆఫీసర్ గద్దాడ శిరీష, కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్ఐ జి.ప్రవీణ్ కుమార్, కోర్టు లైజన్ ఆఫీసర్ అబ్దుల్ ఘని, కోర్టు డ్యూటీ ఆఫీసర్ తాళ్లూరి శ్రీనివాసరావులను ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు.

ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం

(5వ పేజీ తరువాయి)

జరిగిందన్నారు. రాకాసితండాలో 55 కుటుంబాలకు తీవ్రనష్టం జరిగిందన్నారు. ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా, పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఆదుకున్నామన్నారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. రాకాసితండాలో వరదలో కొట్టుకుపోయిన కుటుంబాలకు కేశ్వాపురం సమీపంలో 52 మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందించారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులను నిర్లక్ష్యం చేసిందని, ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కలిపించలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. తిరుమలాయపాలెంలో పీఏసీఎస్ నూతన భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన అన్ని పంటలకు మంచి మద్దతు ధర లభిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు పుసులూరి నరేందర్, చావా వేణు, నుడిగాలి కిషన్‌రావు, డీఎస్‌వో గంగాధర్, తహసీల్దార్ సుధీర్, ఏవో సీతారాంరెడ్డి, జేడీఏ పుల్లయ్య, ఏడీఏ వాణి, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, యన్నం సుధాకర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

లారీ వదిలేందుకు

లంచం తీసుకున్నారని..

(5వ పేజీ తరువాయి)


దాడి చేసి సీఐ రమేష్, అతడి గన్‌మన్ రామారావుతోపాటు ప్రైవేటు వ్యక్తి కార్తీక్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ బాధితుడి నుంచి సీఐ రూ.20 వేలు ఫోన్‌పే ద్వారా పొందినట్లు తమ వద్ద ఆధారాలున్నాయని తెలిపారు. గన్‌మన్ రామారావు సైతం సీఐ చెబితేనే తాను రూ.20 వేలు కార్తీక్‌కు ఫోన్‌పే చేయించానని అంగీకరించాడని, దీంతో సీఐ బరపాటి రమేష్, అతడి గన్‌మన్ రామారావుతోపాటు ప్రైవేటు వ్యక్తి దారా కార్తీక్‌లను అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఈ ముగ్గురిని వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా సీఐ బరపాటి రమేష్ విలేకరులతో మాట్లాడుతూ తనను ఈ కేసులోకి అన్యాయంగా లాగుతున్నారని, ఆ డబ్బులు ఎవరు తీసుకున్నారో ఎక్కడికి వెళ్లాయో తనకు తెలియదని తెలిపారు.

భద్రాచలంలో ఆరోసారి ఏసీబీ రైడ్

భద్రాచలంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై ఏసీబీ దాడులు జరగడం ఇది ఆరోసారి. 2024 ఏప్రిల్ 18న అప్పటి భద్రాచలం ఎస్ఐ ఎం.శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకర్, ప్రైవేటు వ్యక్తి నవీన్‌కుమార్‌లు ఓ చోరీ కేసులో నిందితుల నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. 2020 మార్చి 5న భద్రాచలం ఎస్టీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడగా అతడిని లంచం తీసుకునేందుకు ప్రోత్సహించిన ఎస్టీవో ఎస్కే సైదులును కూడా ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. 2019 నవంబరు 28న భద్రాచలంలోని తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కుంజా శ్రీనివాసరావు రూ.వెయ్యి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. అంతకు ముందు భద్రాచలంలోని ఐటీడీఏ రోడ్డులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ అవినీతికి పాల్పడుతుండగా ఏసీబీకి పట్టుబడ్డాడు. 2018 ఏప్రిల్ 30న ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగంలో ఈఈ ఎం.శంకర్, ఏఈ సత్యనారాయణలను రూ.50వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

కార్మికుల ప్రదర్శన

- బకాయిలు చెల్లించాలని డిమాండ్



ప్రదర్శన చేస్తున్న కార్మికులు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మునిసిపాలిటీలోని కార్మికులు ఏరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మణుగూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలో కార్మికులకు ఇవ్వాల్సిన ఏరియర్స్‌పిఎఫ్, ఇన్సూరెన్సులు చెల్లించినప్పటికీ మణుగూరులో మాత్రం వాటిని చెల్లించలేదని పేర్కొన్నారు. అందుకే సమస్య పరిష్కారం కోసం కార్మికులు సమ్మె బాట పట్టారని తెలిపారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు సీపీఎం సీనియర్ నేత నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు, పల్లపు నాగేశ్వరరావు, నర్సింహారావు, దుర్గయ్య, రమాదేవి, పుల్లయ్య, ఎల్లమ్మ, తదితరులున్నారు.

ఆసక్తి ఉన్న ప్రతీ పూర్వ వీఆర్వోను

జీపీవోగా నియమించాలి

» తెలంగాణ రెవెన్యూ అధికారుల జాయింట్ యాక్షన్ కమిటీ



మాట్లాడుతున్న వీఆర్వోల సంఘం నాయకులు నాగుల్‌మీరా, గురుమూర్తి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖకు తిరిగి రావడానికి ఆసక్తి ఉన్న ప్రతీ పూర్వ వీఆర్వోను జీపీవో(గ్రామ పంచాయతీ ఆఫీసర్)గా ప్రభు త్వం నియమించాలని తెలంగాణ రెవెన్యూ అధికారుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు షేక్ నాగుల్ మీరా, మన్నే గురుమూర్తి డిమాండ్ చేశారు. గురువారం టీటీడీసీలో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కారు ఇటీవలె జీపీవోల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షనీయమన్నారు. అయితే జీపీవోగా నియమించడానికి పూర్వ వీఆర్వోలకు స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తామన్న నిబంధన సరైంది కాదన్నారు. వీఆర్వోలకు గత 25 ఏళ్లుగా గ్రామ స్థాయి అధికారిగా పనిచేసి అనుభవం ఉందన్నారు. వీఆర్వో, జీపీవో పోస్టులు ఒకేస్థాయి పోస్టులు కాబట్టి ప్రత్యేకంగా స్క్రీనింగ్ టెస్టు నిర్వహించాల్సిన అవసరం లేదని వారు అభిప్రాయపడ్డారు. ఎలాంటి స్క్రీనింగ్ టెస్టు, పరీక్ష లేకుండా రెవెన్యూ శాఖకు తిరిగి రావడానికి ఆసక్తి ఉన్న ప్రతీ పూర్వ వీఆర్వోను జీపీవోగా నియమించాలని కోరారు. పూర్వవీఆర్వోల గతంలో ఉన్న సర్వీసును రెవెన్యూశాఖలో సీనియారిటీకి పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీఆర్వోల సంఘానికి టీఎన్జీవో నాయకులు సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

టీఎన్జీవో జిల్లా అధ్యక్ష గుంటుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో నెంబర్ 129 ద్వారా పూర్వ వీఆర్వోలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వీస్ అనేది ప్రతి ఉద్యోగి హక్కుఅని ఆ హ క్కును కాపాడటంలో టీఎన్జీవో ముందుంటుందన్నారు. ఈ విషయాలపై రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొణిదల శ్రీనివాస్ , ట్రెసా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుంబూరి సునీల్ రెడ్డి, దొడ్డ పుల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమంచి శ్రీనివాసరావు, నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బిక్కు, వీఆర్ఏల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అజీజ్, ఫులుసూ వెంకటేశ్వర్లు, షేక్ అన్వర్, లవన్, సుధీర్, శీలం వెంకటేశ్వర్లు రామిశెట్టి శేఖర్, శ్రీనివాస్, షేక్ మస్తాన్ సాహెబ్,వీరభద్రం, చంద్రశేఖర్, కోటయ్య, కేశ్య, దయాకర్ రెడ్డి, సత్యవతి, అనసూర్య, వసంత బాయి, బుల్లెమ్మ, కేతమ్మ తదితరులు పాల్గొన్నారు..

మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి

» ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టినట్టు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు గురువారం ఒకప్రకటనలో తెలిపారు. స్కూల్ విద్యార్థుల వేసవిసెలవులను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ పోలీసులు ప్రతి రోజు ట్రాఫిక్ సిబ్బంది నగరంలో వాహనాల తనిఖీలు చేపడుతున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి తనిఖీలలో ర్యాష్‌డ్రైవింగ్ అదేవిధంగా మైనర్లు బైకులు, కార్లు నడపుతు పట్టుబడుతున్నారని తెలిపారు. గతంలో మైనర్ డ్రైవింగ్ చేస్తూ పోలీసు వారికి పట్టుబడితే జరిమానా వేసి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించడం జరిగిందని పేర్కొన్నారు. ఇక నుంచి డ్రైవింగ్ చేస్తున్న మైనర్ల వాహనాలు సీజ్‌చేసి, వారితో పాటు వారి తల్లిదండ్రులను న్యాయస్థానంలో హాజరుపరచడం జరుగుతుందని తెలిపారు. తద్వారా న్యాయస్థానం శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఇకనైనా తల్లిదండ్రులు మైనర్లకు వాహనం ఇవ్వకూడదని కోరారు. కొందరు యువకులు ద్విచక్రవాహనాలకు సంబధిత సంస్థ ఇచ్చిన సైలెన్సర్లను మార్పుచేసి అధిక శబ్దం వచ్చే వాటిని అమర్చుతూ ప్రజలకు భయభ్రాంతులు కలిగిస్తున్నారన్నారు. అటువంటి వారి ఆటకట్టించేందుకు ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.



ఆదాయం అదుర్స్

» లక్ష్యాన్ని మించి వసూలు చేసిన ఆరు మార్కెట్ కమిటీలు » 2024-25 సంవత్సరానికి గాను ఆదాయ వివరాల ప్రకటన

ఖమ్మం మార్కెట్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయాలు టాప్ గేర్‌లో దూసుకుపోతున్నా యి. మార్కెట్ కమిటీలకు ఈ ఏడాది రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన ఫీజు వసూళ్ల ఆదాయ లక్ష్యాన్ని ఛేదించి అంతకు మించి ఆదనపు ఆదాయాన్ని సాధించాయి. జిల్లాలో ప్రధానంగా ఖమ్మం, మధిర, నేలకొండపల్లి, కల్లూరు, వైరా, ఏన్కూరు, సత్తుపల్లి, మద్దులపల్లి తదితర 8 మార్కెట్ కమిటీలకు 2024- 2025 సంవత్సరానికి గాను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ రూ.63.95 కోట్ల మార్కెట్ ఆదాయాన్ని సమకూర్చాలని టార్గెట్‌గా నిర్దేశించింది. అయి తే జిల్లాలోని మార్కెట్ కమిటీలు సీజన్ ప్రారంభంలో కొంత తడబడినప్పటికీ ఇప్పటి వరకు సుమారు రూ.65.56 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకోవడం విశేషం. కాగా ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చి 31 నాటికి మార్కెట్ కమిటీలు రూ.2 కోట్ల వరకు అదనపు ఆదాయం వసూలు చేశారు. మార్కెట్‌లకు ముఖ్యంగా యార్డులలో జరిగే క్రయవిక్రయాలపై కేవలం 1 శాతం ఫీజు వసూలుతోనే ఆదాయం సమకూరుతుంది. అంతేకాకుండా మార్కెటింగ్ శాఖకు అనుబంధంగా ఉన్న జిన్నింగ్ మిల్లులు, రైస్‌మిల్లులు, వ్యవసాయ చెక్‌పోస్టులు, శీతల గిడ్డంగులు, ధాన్యం, కూరగాయల మార్కెట్‌లతో పాటు పేపర్ మిల్లులకు వెళ్లే సుబాబుల్, జామాయిల్ రవాణాపై సైతం ఒక శాతం మా ర్కెట్ ఫీజు మార్కెట్ ఖజానాకు చేరుతుంది.

ధరలు తక్కువగా ఉన్నా లక్ష్యాన్ని సాధించాం

● ఎంఏ అలీం, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి



ఈ ఏడాది రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఖమ్మం జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి నిర్దేశించిన టార్గెట్‌ను మార్చి నెలాకరు వరకు లక్ష్యాన్ని సాధించి రాష్ట్రంలోనే ముందున్నాం. ఈ ఏడాది మిర్చి పంటకు ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సీజన్ మొదట్లో మార్కెట్ ఫీజు వసూలులో కొంత వెనకబడిన మాట వాస్తవం. అయినా సరే ప్రతి వ్యాపారికి చెందిన మార్కెట్ ఫీజును సకాలంలో వసూలు చేసి లక్ష్యాన్ని నెరవేర్చుకోవడం ఆనందంగా ఉంది. ఇంకా మార్కెట్ కమిటీల ఆదాయం పెంచే వనరులపై దృష్టి పెడుతున్నాం.

వెనకబడిన నేలకొండపల్లి, ఏన్కూరు మార్కెట్ కమిటీలు

ఆదాయ లక్ష్య ఛేదనలో ఈ ఏడాది నేలకొండపల్లి, ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కొంత మేర వెనకబడినట్లు అధికారిక అంచనాలు చెబుతున్నాయి. నేలకొండపల్లి మార్కెట్‌కు ఈఏడాది నిర్దేశించిన టార్గెట్ ఆదాయం రూ. 3.78 కోట్లకు గాను ఇప్పటివరకు రూ. 3.66 కోట్లు మాత్రమే వసూలు చేసింది. ఏన్కూరు మార్కెట్ కమిటీ ఆదాయ లక్ష్యం రూ. 4.87 కోట్లకు గాను రూ. 3.43 కోట్లు మాత్రమే వసూలు చేసి కొంత వెనుకంజలో ఉంది. కాగా ఈ రెండు మార్కెట్‌లలో ఈ ఏడాది మిర్చి పంట క్రయ, విక్రయాలు అసలు లేక పోవడంతోనే ఆదాయం తగ్గడానికి ముఖ్య కారణమని అధికారులు పేర్కొంటున్నారు.

లక్ష్యాన్ని దాటేసిన ఖమ్మం, మధిర, వైరా, కల్లూరు, సత్తుపల్లి, మద్దులపల్లి మార్కెట్ కమిటీలు

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన ఆదాయం టార్గెట్ మేరకు ఖమ్మం, మధిర, సత్తుపల్లి, వైరా, కల్లూరు, మద్దులపల్లి మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని దాటి ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చుకోవడం విశేషం. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఈ ఏడాది నిర్దేశించిన రూ. 30 కోట్లకు గాను రూ.30.57 కోట్లు, మధిర మార్కెట్ కమిటీకి నిర్దేశించిన రూ.4.75 కోట్లకు గాను రూ.4.84 కోట్లు, సత్తుపల్లి మార్కెట్‌కుఈ ఏడాది నిర్దేశించిన రూ.4.94 కోట్ల కు గాను రూ.6.01 కోట్లు, వైరా మార్కెట్ కమిటీకి నిర్దేశించిన రూ.6.73 కోట్లకు గాను రూ.6.94 కోట్లు, కల్లూరు మార్కెట్‌క నిర్దేశించిన రూ. 5.67 కోట్లకు గాను రూ.6.78 కోట్లు, మద్దులపల్లి మార్కెట్ కమిటీకి నిర్దేశించిన రూ.3.15 కోట్లకు గాను రూ.3.30 కోట్లు సాధించి కొంత అదనంగానే ఆదాయం సమకూర్చుకున్నాయి.

మార్కెట్ కమిటీల లక్ష్యం, రాబడి వివరాలు గత మూడేళ్లు వరుసగా.....

మార్కెట్ కమిటీలు	2022-23లో లక్ష్యం-రాబడి (రూ.కోట్లలో)	2023-24లో లక్ష్యం-రాబడి (రూ.కోట్లలో)	2024-25లో లక్ష్యం-రాబడి (రూ.కోట్లలో)
ఖమ్మం	25.27- 26.07	26.14 - 27.61	30.02- 30.57
మధిర	4.58 - 4.28	4.34 - 4.55	4.75 - 4.84
నేలకొండపల్లి	5.19 - 5.26	4.05 - 3.91	3.78 - 3.66
కల్లూరు	4.50- 5.24	4.17 - 4.84	5.67 - 6.78
వైరా	4.92- 5.86	4.72 - 5.78	6.73 - 6.94
ఏన్కూరు	3.19- 4.11	4.14 - 4.49	4.87 - 3.43
సత్తుపల్లి	3.79- 4.63	3.75 - 4.78	4.94 - 6.01
మద్దులపల్లి	2.92 - 1.74	3.08 - 1.82	3.15 - 3.30



మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి (ఫైల్)

సీతారామ జలాల సాధన కోసం ఉద్యమం

» సీపీఎం జిల్లా నాయకుడు శ్రీధర్

జూలూరుపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సీతరామ ప్రాజెక్ట్ నిర్మాణంతో మండలంలోని రైతులు వందలాది ఎకరాల భూములను కోల్పోయినప్పటికి వారికి గోదావరి జలాలను అందించకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తుందని సీపీఎం జిల్లా నాయకుడు కొండపల్లి శ్రీధర్ అన్నారు. గురువారం జూలూరుపాడులోని సీపీఎం కార్యలయంలో జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ జూలూరుపాడు మండలంలోని రైతులకు సీతారామ జలాల సాధనకై తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జూలూరుపాడు మండలంలోని రైతులకు సీతారామ జలాలను అందించేల రూపకల్పన చేయగా అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం డిజైన్‌ను మార్చి మండలంలోని రైతులకు చుక్కనీరు రాకుండా చేసిందని తెలిపారు. పిల్ల కాలువలను ఏర్పాటుచేసి మండలంలోని ప్రతి ఎకరాలకు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను అందించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణంతో భూములను కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, మాజీ ఎంపీటీసీ బానోత్ ఈశ్వర్, నాయకులు వలమల్ల చందర్‌రావు, గార్లపాటి వెంకటి, కనకరత్నం, రాధాకృష్ణ, అభిమిత్ర, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు ఖమ్మం జిల్లా క్రీడాకారుల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈనెల 30 నుంచి మే 5 వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు స్టేడియం స్కేటింగ్ కోచ్ సురేష్ తెలిపారు. సర్దార్ పటేల్ స్టేడియంలో సాధన చేసే క్రీడాకారులు సమీన్, చాతుర్య, మిధిలేష్, వ్యూహిత, పాల్గుణ జనవరిలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపి, జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి అభినందించారు. జాతీయ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

800 లీటర్ల విప్పపువ్వు పానకం ధ్వంసం



విప్పపువ్వు పానకాన్ని ధ్వంసం చేసిన ఎక్సైజ్, పోలీసు సిబ్బంది

మణుగూరు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ది పల్లి, పగిడేరు గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన విప్ప పువ్వు పానకాన్ని గురువారం మణుగూరు ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి, ఎక్సైజ్, పోలీసు సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ధ్వంసం చేశారు. సమాచారం మేరకు పెద్దిపల్లి గ్రామ సమీపంలోని అడవిలో పలు చోట్ల ప్లాస్టిక్ డ్రమ్ముల్లో విప్పసారా కాసేందుకు సిద్ధంగా ఉన్న పానకాన్ని వెలికి తీసి ధ్వంసం చేయడం జరిగిందని సీఐ తెలిపారు. పగిడేరు గ్రామంలో కూడా పలు చోట్ల దాచిన పానకాన్ని వెలికి తీసి బయట పారబోశామన్నారు. ఈ దాడుల్లో దాదాపు 800 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ పేర్కొన్నారు. అలాగే సారా తయారీకి వాడే సామగ్రిని దహనం చేశారు. పగిడేరులో ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది బండి కృష్ణ వేణి, సతీష్, ప్రసన్న, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది షఫీ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడులో ప్రైవేట్ ఆస్పత్రి సీజ్



ఆస్పత్రిలో మందులను తనిఖీ చేస్తున్న మధువరణ్

జూలూరుపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి వైద్యం చేస్తుండటంతో ఓ ఆర్ఎంపీపై జిల్లా వైద్యశాఖ చర్యలకు ఉపక్రమించింది. మండలంలోని పాపకొల్లు గ్రామంలో అభిరాం అనే ఐదేళ్ల బాలుడికి ఇటీవల ఓ ఆర్ఎంపీ వైద్యుడు చికిత్సలు చేయడంతో, వైద్యం వికటించి బాలుడు ప్రాణపాయ స్థితిలోకి వెళ్లాడు. దీంతో స్థానికులు వైద్యాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదుల నేపథ్యంలో డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్ ఆదేశాల మేరకు గురువారం పాపకొల్లు గ్రామాన్ని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి వి.మధువరణ్ సందర్శించారు. ప్రయివేట్ ఆసుపత్రులో తనిఖీలు నిర్వహించారు. ఆర్ఎంపీ వైద్యుడు పూసాల శ్రీనివాస చారి ప్రజలకు స్టెరాయిడ్స్, యాంటీబయాటిక్స్, ఫ్లూయిడ్స్ అందిస్తున్నట్లు తనిఖీలో ఆయన గుర్తించారు. దీంతో ఆస్పత్రిని సీజ్ చేశారు. ఆనంతరం జూలూరుపాడులోని ప్రభుత్వ ఆస్పత్రిలో అధికారి మధువరణ్ విలేకర్లతో మాట్లాడుతూ ఆర్ఎంపీ వైద్యుడు పరిమితికి మించి వైద్యం చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో ఆస్పత్రిని సీజ్ చేశామని, త్వరలోనే అతడికి నోటీసును జారీ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న వారిపై కేసు

పాల్వంచ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పశువులను తరలిస్తున్న ముగ్గురిపై పాల్వంచ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మణుగూరు నుంచి బషీర్‌బాగ్‌కు ఒకే లారీలో 23 పశువులను ఎక్కించి, వాటిని తరలిస్తుండగా పాల్వంచ అడిషనల్ ఎస్ఐ రాఘవయ్య పాల్వంచ దమ్మపేట సెంటర్లో లారీని అడ్డుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పశువులను లారీలోకి ఎక్కించిన వ్యక్తిపై, లారీ డ్రైవర్‌పై, యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

మిరప నర్సరీలను చట్ట ప్రకారం ఏర్పాటు చేయాలి

» జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్



మాట్లాడుతున్న ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్

ఖమ్మం వ్యవసాయం , ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చట్టం ప్రకారం మిరప నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్ ఆదేశించారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మిరప నర్సరీ యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. నర్సరీ చట్టంలోని సూచనల ప్రకారం ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తన కంపెనీల నుంచి నాణ్యమైన విత్తనాలు సేకరించి, ఉద్యాన అధికారుల పర్యవేక్షణలో నారు పెంచి రైతులకు సరఫరా చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోవు సీజన్లో కల్తీ లేని నారు సరఫరాకు ముందస్తు ప్రణాళికలు తీసుకొనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయఅధికారి పుల్లయ్య మాట్లాడుతూ నర్సరీ యజమానులు తప్పనిసరిగా రిజిస్టర్లు పాటించాలని సూచించారు. లైసెన్స్ డీలర్ల దగ్గరే నారు కొనుగోలు చేయాలన్నారు. సహాయ వ్యవసాయ అధికారి వాసవి రాణి మాట్లాడుతూ నర్సరీ యజమానులు నర్సరీ చట్టం ప్రకారం నడుచుకుంటూ సీడీయాక్ట్ లోని నిబంధనలను లోబడి లైసెన్సులు, సర్టిఫికెట్ పొందిన కంపెనీల నుంచి మిరప విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సరీ యజమానులు హనుమంతరావు నరసింహారావు నా గేశ్వరరావు తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారి ముత్యాలు పాల్గొన్నారు.

భూవివాదంలో ఇరువర్గాల ఘర్షణ

● రామచంద్రాపురంలో ఉద్రిక్తత

అశ్వాపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భూవివాదం నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో గురువారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడింది. సంఘటనకు సంబంధించిన వివరాలు.. రామచంద్రాపురం గ్రామంలో వాటర్ ట్యాంకు సమీపంలో సర్వేనెంబరు 190/1లో ఎకరం 20గుంటల భూమి ఉంది. ఈభూమిపై గత కొన్నేళ్లుగా గ్రామస్థులకు, సారపాకకు చెందిన కనకమేడల హరిప్రసాద్ కుటుంబం మధ్య వివాదం కొనసాగుతోంది. ఇదిగ్రామ కంఠానికి సంబంధించిన భూమి అని, రెవెన్యూ అధికారులు కూడా నిర్ధారించి గ్రామపంచాయతీకి అప్పగించారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కాగా ఇదితాత, ముత్తాతల నుంచి తనకు వారసత్వంగా వచ్చిన భూమి అని హరిప్రసాద్ హైకోర్టు ను ఆశ్రయించి తన భూమిగా ఆర్డర్ పొందాడు. కాగా గురువారం సదరు భూమిలో ఎక్స్‌కవేటర్‌తో పెన్సింగ్ వేసేందుకు హరిప్రసాద్ తన అనుచరులతో రాగా, విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడకు పెద్దఎత్తున చేరుకున్నారు. అయితే గతంలో జరిగిన వివాదాల నేపథ్యంలో వారసత్వంగా పొందిన సుమారు 40ఎకరాల భూమిపోను, 190/1లో ఉన్న 1.20గుంటల భూమిని గ్రామకంఠానికి అప్పగిస్తూ అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో ఒప్పందం చేసుకుని, ఇప్పుడు కోర్టు ఆర్డరు అంటూ రావడం ఏమిటని గ్రామస్థులు ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. ఈ సందర్భంలో గ్రామస్థుల దాడిలో హరిప్రసాద్ అనుచరులకు సంబంధించిన కారు అద్దాలు పగిలాయి. గ్రామస్థులను అడ్డుకునే క్రమంలో సీఐ గన్‌మెన్ రమేష్‌ను హరిప్రసాద్ అనుచరుడిగా భావించిన కొందరు అతనిపై చేయిచేసుకోవడంతో, మిగతా గ్రామస్థులు అడ్డుకున్నారు. పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించివేశారు. అనంతరం ఇరువర్గాల వారు పరస్పరం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

రోడ్డు ఆక్రమణపై అధికారుల చర్యలు

ఆళ్లపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డును ఓ వ్యక్తి ఆక్రమించారన్న ఆరోపణలపై అధికారులు చర్యలు చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రంలో ప్రధాన కూడలిలోని సీసీ రోడ్డు ఆక్రమణకు గురైనట్టుగా గత నెల రోజులకు పైగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి, గ్రామస్థులకు మధ్య తీవ్ర చర్చ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో నెల రోజుల తరువాత అధికారులు స్పందించారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించగా, గ్రామ పంచాయతీ కార్యదర్శి శిరీష ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో మట్టి, రేకుల షెడ్ తొలగించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఇప్పటికే తనకున్న ఆధారాలతో న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు కూడా గురువారం స్టే వెల్లడించిందని అధికారుల్లో, గ్రామంలో చర్చ సాగుతోంది.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని దురదపాడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దురదపాడు గ్రామానికి చెందిన గీగా శివ (28) పంపు ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. శివ ఇంట్లో డబ్బులు ఇవ్వకపోగా ఎక్కువ అప్పులు చేయడంతో భార్య భర్తలు గొడవ పడ్డారు. దీంతో మనస్థాపం చెందిన శివ తన ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి గీగా బుజ్జి దమ్మపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయగా, అదనపు ఎస్ఐ బాలస్వామి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దమ్మపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన గట్టుగూడెం గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కాసరబండ గ్రామానికి చెందిన మచ్చ ఎల్లయ్య (37) కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సూర్యాపేటకు చెందిన కొందరితో కలిసి కూలీపనులు నిమిత్తం దమ్మపేట మం డలం గట్టుగూడెంలో వేరు శెనగ కోత పనుల కోసం వచ్చాడు. పని నిమిత్తం తోటలోకి వెళుతూ రోడ్డు దాటుతుండగా అశ్వారావుపేట వైపునకు వెళుతున్న లారీ వేగంగా వెళుతూ అదుపు తప్పి అతడిని ఢీకొట్టింది.

ఈఘటనలో ఎల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో సత్తుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతడిని పరిశీలించిన డాక్టర్లు మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుని బంధువు వీర మహేష్ ఫిర్యాదు మేరకు అదనపు ఎస్ఐ బాలస్వామి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

అన్నపురెడ్డిపల్లిలో ఒకరు...

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో నామారం- పెంట్లం గ్రామాల మధ్య గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భాస్కరాపురం గ్రామానికి చెందిన తేజావత్ శ్రీను (50) తన స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై రాజాపురం వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అతడిని వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు.

మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉ న్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదెల మృత్యువాత

దమ్మపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలతో పాటు ఒక దూడ మృతి చెందిన ఘటన వెంకరాజపురం (అచ్యుతాపురం)లో గురువారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. రంగువారిగూడెం పంచాయతీ పరిధిలోని వెంకటరాజపురం గ్రామానికి చెందిన దుంగల నాగమణి తమ గేదెలను మేత మేపేందుకు వెళ్లింది. మేత మేసుకుంటూ గేదెలు పామాయిల్ వ్యవసాయక్షేత్రంలో వెళ్లగా తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. తమ కుటంబానికి ఆగేదెలే ఆధారమని, వాటిని కూడా అప్పుచేసి కొనుగోలు చేసినట్లు తెలిపింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంది.

సెల్‌ఫోన్ దొంగకు ఆరు నెలల జైలు

భద్రాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ దొంగతనం కేసులో బండారు సాయితేజ అనే వ్యక్తికి ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ గురువారం తీర్పు వెల్లడించారు. 2022లో జరిగిన సంఘటనలో నిందితుడు నేరం చేసినట్లు రుజువు కావడంతో శిక్షను ఖరారు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ శ్రీనివాస్ వాదించారు.

రేషన్ బియ్యం పట్టివేత

దుమ్ముగూడెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరంలో గురువారం అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉంచిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గిర్దావర్లు నర్సింహారావు, వెంకటేశ్వరావులు పట్టుకున్నారు. స్థానిక సంత వ్యాపారి ఒకరు ట్రాక్టరుపై బియ్యం మూటలను తరలించేందుకు ఇంటి బయట సిద్ధంగా ఉంచగా, అటుగా వస్తున్న రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. సివిల్ సప్లయిస్ డీటీ గుండి రాజులు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని స్థానిక రేషన్‌దుకాణానికి తరలించారు.

ఐదు కేజీల గంజాయి....

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత బస్టాం డ్ సమీపంలో గురువారం 5 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఒరిస్సాకు చెందిన శిబరామ్‌రౌత్ అనే వ్యక్తి గురువారం ఓ బ్యాగ్‌తో పాత బస్టాండ్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా విధుల్లో ఉన్న పోలీసులకు అనుమానంగా కనిపించాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని బ్యాగ్‌ను తనిఖీచేయగా ఐదు కేజీల గంజాయి పట్టుబడింది. దీంతో అతడిని విచారించగా ఒరిస్సా నుంచి గంజాయి తీసుకొని ముంబైకి వెళుతున్నట్లు తెలిపాడు. దీంటో అతనిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.



నేడు జ్యోతిరావు పూలే జయంతి

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): శుక్రవారం జరపనున్న జ్యోతిరావు పూలే జయంతిని విజయవంతం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 11న ఉదయం శ్రీశ్రీసర్కిల్‌లో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చిత్రపటానికి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని బీసీ కులస్థులు, బీసీ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పారిశుధ్య వాహనాల నిలిపివేత

- కేఎంసీ కాంట్రాక్టర్ల బెదిరింపు ధోరణి
- కాంట్రాక్టర్లతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కుమ్మక్కు
- వెంటనే ఏర్పాట్లు చేసిన అధికారులు

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): బిల్లులు రాలేదనే నేపంతో బుధవారం 1 నుంచి 30 డివిజన్లకు పారిశుధ్య వాహనాలను కాంట్రాక్టర్ నిలుపుదల చేశారు. కేఎంసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సంఘటన ఒక్కసారిగా ఖమ్మం నగర పాలక సంస్థను ఉలిక్కిపాటుకు గురి చేసింది. బ్లాక్‌లిస్టులో ఉన్న కాంట్రాక్టర్లకు మళ్లీ మళ్లీ అవకాశాలు ఇవ్వటంతోనే ఇటువంటి బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇటువంటిపై వారిపై ఖమ్మం పాలకవర్గం కఠినంగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు.ఖమ్మం నగర పాలక సంస్థలోని కొంతమంది కాంట్రాక్టర్లు గతంలో అనేక తప్పులు చేయటంతో వారిని బ్లాక్ లిస్టులో పెట్టారు. కొత్తగా వచ్చిన అధికారులు బ్లాక్ లిస్టులు పరిశీలించకుండా తిరిగి వారిని టెండర్లలో పాల్గొనేలా చేయటంతో మళ్లీ, మళ్లీ కాంట్రాక్టు అవకాశాలు పొందుతున్నారు. ఏకంగా కేఎంసీకి తలనొప్పిగా మారారు. ఓ మ్యాన్ పవర్ కాంట్రాక్టర్ ఆకస్మికంగా పారిశుధ్య వాహనాలను నిలుపుదల చేయగా మరి కొంతమంది కాంట్రాక్టర్లు రింగ్‌గా ఏర్పడి టెండర్లు వేయకుండా చేస్తున్నారు.

కాంట్రాక్టర్లతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కుమ్మక్కు

ఖమ్మంనగరంలో 1నుంచి 30 డివిజన్‌లకు ఓఏజెన్సీకి కాంట్రాక్ట్ అప్పగించారు. నిత్యం 16 పారిశుధ్య ట్రాక్టర్లుతో 54 మంది కార్మికులను పంపించాల్సి ఉంటుంది. ప్రతీ టాక్టర్‌కు డ్రైవర్‌తో పాటుగా ఒక సహాయకుడుని ఇవ్వాలి. పని గంటలను ఖచ్చితంగా నమోదు చేయాలి. రోజుకు కనీసం రెండు ట్రిప్పులు వేయాల్సి ఉంటుంది. ట్రాక్టర్ ట్రాలీ ఎత్తుగా ఉండి, ట్రాలీకి టార్పెల్‌ను సైతం నిర్మాణం చేసి రోడ్డు మీద చెత్త పడకుండా పారిశుధ్య రవాణా చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇటువంటి నిబంధనలను ఖమ్మంలో శానటరీ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించటం లేదు. ట్రాక్టర్‌లకు సహాయకులుగా కాంట్రాక్టర్‌కు కార్మికులను పంపకున్నా డివిజన్లలో పనిచేసే కార్మికులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పనులకు పంపుతున్నారు. రోజువారి హాజరులోను కాంట్రాక్టర్‌కు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సహకరిస్తున్నారు. కార్మికులు సంఖ్య తక్కువగా ఉన్నా కూడా ఎక్కువ హాజరు నమోదు చేస్తున్నారు. కొన్నినెలల్లో 30 రోజులు హాజరు నమోదు చేస్తున్నారు. కేఎంసీకి కార్మికుల హాజరు రికార్డులను కూడా సరైన సమయానికి పంపటం లేదు. బిల్లులు చివరి రోజుల్లో పంపుతున్నారు. కనీసం హాజరు పరిశీలించి బిల్లులు చేసే సమయం కూడా కేఎంసీ అధికారులకు ఉండటం లేదు.

సాంకేతిక జాప్యం

కేఎంసీలోని ఏజెన్సీకి సెప్టెంబరు, అక్టోబరులో బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇవ్వాలా, లేక స్థానికంగా ఇవ్వాలనే అంశంపై సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. నవంబరు, డిసెంబర్‌బిల్లులను కేఎంసీ నిధుల నుంచి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. జనవరి, ఫిబ్రవరి నెలల బిల్లులు ఆలస్యంగా ఖమ్మం నగర పాలక సంస్థకు హాజరు, ఇతర రికార్డులు చేరాయి. కేఎంసీ బిల్లుల చెల్లింపులతో సంబంధం లేకుండానే కాంట్రాక్టర్ ప్రతీ నెల కార్మికులకు వేతనాలను చెల్లించాల్సి ఉంటుంది. కానీ బిల్లులు రాలేదని కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవటంతో వారంలో రెండు రోజులు కార్మికులు పనులు మానుకొని కార్మిక సంఘాల నాయకులను వెంటబెట్టుకొని కేఎంసీలో నిరసనలు చేస్తున్నారు.

ధాన్యాన్ని 48గంటల్లో కొనుగోలు చేయాలి

- కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు
- తరుగు తీస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



బోదులబండలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

నేలకొండపల్లి, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని 48 గంటల్లో కొనుగోలు చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టవద్దని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హెచ్చరించారు. గురువారం మధ్యాహ్నం మండల పరిధిలోని బోదులబండలోని సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? కొనుగోలు కేంద్రంలో అన్ని సౌకర్యాలున్నాయా? అంటూ ప్రశ్నించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. తొలుత నేలకొండపల్లి మార్కెట్ యార్డులోని డీసీఎమ్మెస్ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. బోదులబండ వెళుతూ మార్గమధ్యంలో వరిని కోస్తున్న హార్వెస్టర్ వద్దకు వెళ్లి, పొలాన్ని కోసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న రైతులతో ముఖాముఖీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో దళారులకు అమ్ముకోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకుని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మద్దతు ధరతో పాటుగా ప్రభుత్వం నుంచి వచ్చే బోనస్‌ను పొందాలన్నారు. తరుగును తీస్తే తనకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. తరుగుతీసే మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎటువంటి సమస్యలు రాకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తుండాలని, ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కూసుమంచి ఏడీఏ సరిత, తహసీల్దార్ జాదవ్ మాణిక్యం, ఎంపీడీఓ మర్రి యర్రయ్య, మండల వ్యవసాయాధికారి రాధ పాల్గొన్నారు.

పరిష్కారానికి చొరవేదీ?

జిల్లా ఆస్పత్రిలో రోగుల ఇక్కట్లు



జిల్లా జనరల్ ఆస్పత్రిలో బయట ఉన్న మరుగుదొడ్ల దుస్థితి ఇలా

ఖమ్మంకలెక్టరేట్,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రికి నిత్యం వచ్చే రోగులు.. వారి కుటుంబీకులకు ఆస్పత్రి అధికారులు చుక్కలు చూపుతున్నారు. సమస్యల పరిష్కారానికి సాక్షాత్తు కలెక్టరే పలుమార్లు సమస్యలేంటీ... నేనేం చేయాలంటూ ఎదురు ప్రశ్నించే అధికారికి కనీసం తమ సమస్య ఏంటో చెప్పుకోలేని దీనస్థితిలో మన ఆస్పత్రి అధికారులున్నారు. నిధులు ఇవ్వడానికి కలెక్టర్ ముందుకొస్తున్నా.. రోగుల సమస్యల పరిష్కారానికి చొరవ మాత్రం ఆస్పత్రి అధికారుల్లో కనిపించడం లేదు. దీంతో ఆస్పత్రి బయట ఉన్న మరుగుదొడ్లకు తలుపులు లేక అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి రెండో అంతస్థు మెట్ల దగ్గర ఉన్న మరుగుదొడ్లకు తలుపులు లేవు. దీంతో వీటిని ఎలా వినియోగించాలో రోగులకు... అర్థం కావడం లేదు!



ఆస్పత్రి లోపల మరుగుదొడ్ల పరిస్థితి ఇలా

మాజీ ఎమ్మెల్యే రజబ్ అలీకి ఘన నివాళి



రబజ్‌అలీ స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న హేమంతరావు, నాయకులు

రఘునాథపాలెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యేగా పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో గళమెత్తిన దివంగత మాజీ ఎమ్మెల్యే రజబ్‌అలీ ఈ నాటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. రజబ్‌అలీ స్వగ్రామం రఘునాథపాలెం మండలం పాపటపల్లిలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఖమ్మం నుంచి పాపటపల్లి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. రబజ్‌అలీ స్మారక స్తూపానికి పూలమాల వేసిన నాయకులు అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఖమ్మం నియోజకవర్గం నుంచి రెండుసార్లు, సుజాతనగర్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజాసేవ చేసిన ఘనత రజబ్‌అలికే దక్కిందన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, మహ్మద్ సలామ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, యర్రా బాబు, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, పోటు కళవతి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, అజ్మీర రామ్మూర్తి, సీతామహాలక్ష్మీ, గాదె లక్ష్మీనారాయణ, యానాలి సాంబశివారెడ్డి, శాఖమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మినీడంపింగ్ యార్డుల ఏర్పాటు వద్దు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో మినీడంపింగ్ యార్డుల ఆలోచన విరమించుకోవాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ కోరారు. రెండో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కమిషనర్ అభిషేక్ అగస్త్యకు బుధవారం వినతి పత్రంఅందించారు. కొత్తబస్టాండ్‌కు సమీపంలో డంపింగ్‌యార్డు ఏర్పాటుతో నగరంలో దుర్వాసన వ్యాపిస్తుందని వివరించారు. నాయకులు బోడపట్ల సుదర్శన్, జె వెంకన్నబాబు, మల్లికార్జున్‌రెడ్డి, హుస్సేన్, షఫీ, బిక్షం, ప్రవీణ్ పాల్గొన్నారు.

రైతులకు గుర్తింపు కార్డుల అందజేత

ఖమ్మంమార్కెట్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని 44వ డివిజన్ పరిధిలో పెవీలియన్ గ్రౌండ్ వద్ద పునఃనిర్మించిన రైతుబజార్‌లో గురువారం రైతులకు గుర్తింపు కార్డులను మేయర్ పునకొల్లు నీరజ అందించారు. రైతుబజార్‌లో దళారులకు అవకాశం లేకుండా కూరగాయలు పండించే రైతులే సొంతంగా అమ్ముకునేందుకు సౌకర్యంగా మరలా నిర్మించామని అన్నారు. ఖమ్మం చుట్టు పక్కల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. గుర్తింపు కార్డు ఉన్న వారికి మాత్రమే రైతుబజార్‌లో పంట అమ్ముకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ, రైతుసంఘం నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావు, డీఎంవో అలీం, ఈవో శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులను అందిస్తున్న మేయర్

ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలి

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
- రాజీవ్‌యువ వికాసం కౌంటర్ పరిశీలన



రాజీవ్ యువ వికాసం కౌంటర్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలని, ఏ ఒక్క దరఖాస్తు తిరస్కరణకు గురి కాకుండా దరఖాస్తుల స్వీకరణ సమయంలోనే అన్ని ధ్రువపత్రాలు, సంతకాలు పరిశీలించిన తర్వాతనే రశీదును అందించి దరఖాస్తులు స్వీకరించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. కేఎంసీలోని రాజీవ్ యువ వికాసం రెండు కౌంటర్లను కమిషనర్ తనిఖీలు చేశారు. దరఖాస్తుదారుల సంతకాలు లేకపోవటాన్ని గమనించారు. రోజుకు ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయి. కులాల వారీగా తెలుసుకున్నారు. దరఖాస్తుదారులకు అందుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. కాగా బుధవారం ఒక్కరోజు 931దరఖాస్తులు అందాయి. వాటిలో ఎస్సీ 179, ఎస్టీ57, బీసీ441, మైనార్టీ 192, క్రిష్టియన్ మైనార్టీ1, దివ్యాంగులు 9, ఇతరులు 54 దరఖాస్తులను అందించారు.

విద్యతోనే జీవితాల్లో వెలుగులు

ప్రొఫెసర్ వినోద్‌కుమార్

ఖమ్మంచర్చికాంపౌండ్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): విద్యతోనే వెలుగులు వస్తాయని, ప్రజల బతకులు బాగుపడతాయని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం జడ్పీసమావేశ మందిరంలో వీరనారీమణుల ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో మహనీయుల జయంతి మాసోత్సవాల సందర్భంగా మహిళలు విద్య, చట్టాలు-పరిష్కార మార్గాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహారా, ఎస్‌బీఐటీ విద్యాసంస్థల డైరెక్టర్ ధాత్రి, ఆదివాసీ మహిళ పారిశ్రామికవేత్త బీఎన్ రత్న, ప్రముఖ సామాజిక కార్యకర్త శ్రీకళ, సురేష్‌నాయక్, వీరన్ననాయక్, మీగడ రామారావు పాల్గొన్నారు.

వంట గ్యాస్ ధరలు తగ్గించాలి

సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్



వరంగల్‌క్రాస్ రోడ్డులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఖమ్మంరూరల్,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): కేంద్రం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం పెంచిన వంట గ్యాస్ ధరలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కేంద్రం తీసుకున్న ధరల పెంపు పేదలపై భారం మోపడమే అవుతుందన్నారు. దీంతో పేదలు వంట గ్యాస్ కొనుగోలు చేసుకునే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. వెంటనే పెంచిన ధలను తగ్గించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నండ్రా ప్రసాద్, ఎస్కే. బషీర్, పి.సంగయ్య, పెద్దవెంకటరెడ్డి, నందిగామ కృష్ణ, వట్టికోటి నరేష్ పాల్గొన్నారు.

ఖమ్మంసంక్షేమవిభాగం:కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరు పేదలను మరింత పేదలుగా ధనికులను మరింత ధనికులుగా చేస్తోందని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి ఆరోపించారు. బుధవారం ఖమ్మంలో గ్యాస్ సిలెండర్‌తో నిరసన చేపట్టారు. వంట గ్యాస్ ధరల ప్రభావం నిరుపేదలపై పడుతుందన్నారు. కార్పొరేట్ శక్తులకు భారీగా రాయితీలు అందిస్తున్న కేంద్రం వంట గ్యాస్ ధరలపై మాత్రం రాయితీలను అమలుచేయటం లేదని ఆరోపించారు. ఝాన్సీ, కే.శ్రీనివాస్, నామాల ఆజాద్, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, జాస్మిన్, శారద, మమత, యశ్వంత్, నజీర్ పాల్గొన్నారు.

16న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 16న సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు బండి రమేష్ పిలుపునిచ్చారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో గురువారం జరిగిన మండల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు వందరోజుల పని కల్పించాలన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ ఒక్కటి ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు నేటికి జరగడం లేదన్నారు. ఏదులాపురం, ముత్తగూడెం, ఆరెకోడు, పల్లెగూడెం, మంగళగూడెం వరకు ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. గుదిమల్ల, పెద్దతండా, ఏదులాపురం, తెల్దారుపల్లి, మద్దులపల్లి, పోలేపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ భూములను సర్వే చేసి పేదలకు ఇళ్లస్థలాలు అందించాలన్నారు. శ్రీకాంత్ సంతాప సభలు గ్రామగ్రామాన జరపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి,జిల్లాకమిటీ సభ్యులు ఎస్కే. భషీర్, నండ్రా ప్రసాద్, నందిగామ కృష్ణ, మోహన్‌రావు, వట్టికూటి నరేష్ పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ విప్లవాత్మక నిర్ణయం

ఖమ్మంసంక్షేమ విభాగం,ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్య పంపిణీ చేసి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పేర్కొన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం నగరంలోని ఓ నిరుపేద లబ్ధిదారుని నివాసంలో సన్నబియ్యంతో భోజనం చేశారు. నాయకులు దివ్య, ఏలూరి రజినీ, బిక్కసాని స్వరూప, ఊరుకొండ చంద్రిక పాల్గొన్నారు.

ఏపీ సీఎంను కలిసిన మందడపు

రఘునాథపాలెం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడ్ని మంచుకొండ సొసైటీ చైర్మన్ మందడపు సుధాకర్ కలిశారు. బుధవారం ఏపీరాజధాని అమరావతికి వెళ్లిన ఆయన చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. నాయకులు యల్లంపల్లి హనుమంతరావు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, కొనకంచి సురేశ్ వెంట ఉన్నారు.



సంక్షేమంలో దేశానికే ఆదర్శం

- మేయర్ నీరజ



సన్నబియ్యంతో భోజనం చేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంసంక్షేమ విభాగం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయటంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని 42వ డివిజన్‌లో సన్నబియ్య లబ్ధిదారురాలు సయ్యద్ సుల్తానా నివాసంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహారాతో కలిసి భోజనాలు చేశారు. కార్పొరేటర్ పాకలపాటి విజయనిర్మల, నాయకులు గౌస్‌పాషా, శౌకత్, రషీద్, పర్వీన్, నజిమా, ఆసీమా పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్, రాజీవ్ యువ వికాసం కౌంటర్లు పరిశీలన

నగర పాలక సంస్థలో నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్, రాజీవ్‌యువ వికాసం కౌంటర్లను మేయర్ నీరజ పరిశీలించారు. కులాల వారీగా దరఖాస్తులు తీసుకొని వాటిని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. నిత్యం ఎన్ని దరఖాస్తులు అందుతున్నాయని సిబ్బందిని మెప్మా ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుదారులకు తుది గడువు పెరిగే కొద్ది సంఖ్య పెరుగుతుందని ఇబ్బంది లేకుండా చూసుకోవాలని కోరారు. అనంతరం 50వ డివిజన్‌లో కుట్టిస్ బేబీ స్టూడియోను మేయర్ నీరజ స్థానిక కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు.

ప్రభుత్వ కాలేజీ విద్యార్థులతో ముఖాముఖీ

ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులతో మేయర్ పునుకొల్లు నీరజ తన ఛాంబర్‌లో ముఖాముఖీ మాట్లాడారు. విద్యార్థులు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మేయర్‌తో ముఖాముఖీ మాట్లాడి పరిపాలన పరమైన అంశాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా ఖమ్మం నగరంలో తీసుకుంటున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలు, పర్యాటక రంగం అభివృద్ధిపై పలువురు విద్యార్థులు మేయర్‌తో మాట్లాడారు. ఈసందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యం మేరకు పట్టుదలతో విద్యాభ్యాసం చేయాలని సూచించారు. అధ్యాపకులు పీ నర్సింహారావు, రవివర్ధన్, పీ వేణుమాధవ్, పూర్ణచందర్, నాగలక్ష్మీవీ వెంకటేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

14వ డివిజన్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మేయర్ పంపిణీ చేశారు. ఐదుగురు లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి నేరుగా అందించారు.

మీసేవా కేంద్రాల్లో ఇష్టారాజ్యంగా వసూళ్లు

- తిరుమలాయపాలెంలో పట్టించుకోని అధికారులు
- నష్టపోతున్న పథకాల దరఖాస్తుదారులు



తిరుమలాయపాలెం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన సేవలందించేందుకుగాను ప్రభుత్వం ప్రవేశపెట్టిన మీసేవా కేంద్రాల్లో ధరలపై అదనంగా తీసుకుంటున్నారు. మండలంలోని బచ్చోడు, కాకరవాయి, తిరుమలాయపాలెంలో2 కేంద్రాలు,పిండిప్రోలు పాతర్లపాడులో మొత్తం ఆరు మీసేవా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే మీసేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయకుండా నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మీసేవా కేంద్రాల్లో కనీస ధరల పట్టిక కూడా ఏర్పాటు చేయలేదు. ఇష్టం వచ్చినట్టు నిర్వాహకులు వసూళ్లకు పాల్పడుతున్నారు.ప్రభుత్వం నిర్దేశించిన ధరలు వసూలు చేయకుండా ఎక్కువమొత్తంలో వసూలు చేస్తూ దందాలకు పాల్పడుతున్నారు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికి తమకేమి పట్టనట్టగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిరుద్యోగులకు స్వయం ఉపాధి కలిపించేందుకు రాజీవ్ యువవికాసం ప్రవేశపెట్టింది. ఈపథకం మీసేవా కేంద్రాల నిర్వాహకులకు వరంగా మారింది. దీంతో నిరుద్యోగులు మీసేవా కేంద్రాల్లో కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం ఆన్‌లైన్ చేసుకుంటే వారి నుంచి పెద్దమొత్తంలో వసూలు దండుకుంటున్నారు. ముఖ్యంగా తిరుమలాయపాలెంలోని రెండుమీసేవా కేంద్రాల్లో కుల, ఆదాయ పత్రాలకోసం ఒక్కోదానికి రూ.45తీసుకోవాల్సి ఉండగా రూ 80నుంచి 100 వసూలు చేస్తున్నారు. నిరక్షరాస్యులైతే వారి నుంచి పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నారు. మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రశీదు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా వదిలేస్తున్నారు. ఈవిషయమై సోమవారం ప్రజవాణి కార్యక్రమంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం కూడా అందించారు

భద్రాద్రి రామయ్య తలంబ్రాల పంపిణీ

సత్తుపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీ రామనవమి సందర్భంగా భద్రాద్రి పుణ్యక్షేత్రంలో సీతారాముల కల్యాణం సందర్భంగా సేకరించిన తలంబ్రాలను సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యూ. రాజ్యలక్ష్మీ గురువారం పంపిణీ చేశారు. రూ.151కే ఇంటికే తలంబ్రాలు అందించే కార్యక్రమాన్ని ఆర్టీసీ సంస్థ కార్గో ద్వారా బుకింగ్ చేసుకున్న వారికి అందించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో విశేషంగా ఆదరణ వచ్చిందన్నారు. అత్యధికంగా తలంబ్రాలను బుకింగ్ చేసేందుకు సహకరించిన వారికి, భక్తులు, ప్రయాణీకులు, ప్రజలకు ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్గో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్‌కే.మునీర్‌పాషా, విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, ఏడీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని 48 గంటల్లో కొనుగోలు చేయాలి

- కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు
- తరుగు తీస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



బోదులబండలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

నేలకొండపల్లి, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని 48 గంటల్లో కొనుగోలు చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టవద్దని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హెచ్చరించారు. గురువారం మధ్యాహ్నం మండల పరిధిలోని బోదులబండలోని సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? కొనుగోలు కేంద్రంలో అన్ని సౌకర్యాలున్నాయా? అంటూ ప్రశ్నించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. తొలుత నేలకొండపల్లి మార్కెట్ యార్డులోని డీసీఎమ్మెస్ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. బోదులబండ వెళుతూ మార్గమధ్యంలో వరిని కోస్తున్న హార్వెస్టర్ వద్దకు వెళ్లి, పొలాన్ని కోసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న రైతులతో ముఖాముఖీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో దళారులకు అమ్ముకోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకుని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మద్దతు ధరతో పాటుగా ప్రభుత్వం నుంచి వచ్చే బోనస్‌ను పొందాలన్నారు. తరుగును తీస్తే తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తరుగుతీసే మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎటువంటి సమస్యలు రాకుండా అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తుండాలని, ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కూసుమంచి ఏడీఏ సరిత, తహసీల్దార్ జాదవ్ మాణిక్యం, ఎంపీడీఓ మర్రి యర్రయ్య, మండల వ్యవసాయాధికారి రాధ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పోషణ పక్షోత్సవాలు

వైరా, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేజీ పినపాక, కొండకొడిమ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. చిన్నారులు వారి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితుల గురించి పరీక్షలు చేశారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. సిరిపురం, గొల్లపూడి సూపర్‌వైజర్‌లు సరిత, బీజాన్‌బీ, స్టేజీ పినపాక అంగన్‌వాడీ టీచర్ ఎస్.కళావతి, పంచాయతీ కార్యదర్శి పార్వతి, ప్రధానోపాధ్యాయుడు జగపతి రావు, గ్రామదీపిక నిర్మల, ఆశవర్కర్ అలివేలుమంగ, కొండకొడిమ అంగన్‌వాడీ టీచర్ సునీత పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

కల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరి చేరకుండా ఉంటాయని కల్లూరు ఐసీడీఎస్ అధికారి రత్తమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని వీరబ్రహ్మేంద్ర కాలనీ, కిష్టయ్య బంజర అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్తమ్మ మాట్లాడారు. కల్లూరు సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి వ్యక్తిగత, ఇంటి ఆవరణ పరిసరాలు పరిశుభ్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమలో పేరువంచ సెక్టార్ సూపర్వైజర్ భవానీ, అంగన్వాడి టీచర్లు సరస్వతి, పద్మజపాల్గొన్నారు.

వంట గ్యాస్ ధర పెంపుపై నిరసన

తల్లాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ టీయూసీఐ ఆధ్వర్యంలో గురువారం తల్లాడలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు షేక్.లాల్‌మియా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు, వంట గ్యాస్ ధరలు, పన్నులు పెంచుతూ భారాలు మోపుతున్నారని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా చమురు, క్రూడాయిల్ రేట్లు తగ్గినప్పటికీ వంట గ్యాస్ ధరలు పెంచటం సిగ్గుచేటన్నారు. టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, ఏరియా కమిటీ నాయకులు రమణ, శ్రీను, రాఘవ, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆనందరావు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు అండ

తల్లాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిగ్రస్తులకు అండగా ఉండి క్షయరహిత సమాజానికి కృషిచేద్దామని మండల వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్ అన్నారు. గురువారం తల్లాడ పీహెచ్‌సీలో క్షయవ్యాధిగ్రస్తులకు ఏడురకాల న్యూట్రీషనల్ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అపోహలు పెట్టుకోవద్దని, పూర్తిగా తగ్గిపోయే జబ్బన్నారు. దాతలు ముందుకొచ్చి క్షయవ్యాధి గ్రస్తులకు న్యూట్రీషనల్ కిట్లు అందించాలని కోరారు. క్షయ వ్యాధికి సంబంధించి మందులు, పరీక్షలు ఉచితంగా అందించటం జరుగుతుందని తెలిపారు. స్టాఫ్‌నర్సు కళావతి, సూపర్‌వైజర్ వై.సురేష్, సంజీవ్‌కుమార్, ఫార్మాసిస్టు శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి వితరణ

పెనుబల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సడియం వంశీ వైద్య ఖర్చుల నిమిత్తం వీఎంబంజర్ గౌడసంఘం ఆధ్వర్యంలో ఎంఈవో, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణకు రూ.లక్షను గురువారం అందజేశారు. గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వంగా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రూ.లక్షా మూ డువేలను అందజేశారు. మానవతా దృక్పథంతో నగదును అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు చలమాల విఠల్ రావు, కాటినేని శ్రీనివాసరావు, వంగా రామారావు, వంగా ఉదయ్‌కుమార్, చిట్టిమోదుల కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ 'చలో బస్తీ'

వైరా, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం చలో బస్తీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పార్టీ పట్టణ అధ్యక్షుడు మనుబోలు వెంకటకృష్ణ తెలిపారు. వైరాలో గురువారం జరిగిన ఆ పార్టీ క్రియాశీలక సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం 195వ పోలింగ్‌బూతు పరిధిలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. నాయకులు చింతనిప్పు రామారావు, ఓర్సు శ్రీనివాసరావు, వెంకటేష్, చెరుకూరి కృష్ణారావు, అనిల్, మాదినేని సత్యనారాయణ, ఉమేష్ పాల్గొన్నారు.

విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

బోనకల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొ డుతూ అలజడి సృష్టిస్తోందని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు ఆరోపించారు. మండలంలోని చిరునోముల గ్రామంలో గురువారం జై బీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో బాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చే కుట్రకు బీజేపీ పాల్పడుతున్నందున ప్రజలను చైతన్య పరచడమే ధ్యేయంగా గ్రామాల్లో పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, జిల్లా నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, బంధం నాగేశ్వరరావు, నాయకులు అనుమోలు వెంకటేష్, గూడ నర్సయ్య శాస్త్రీ, ములకారపు రవి, పల్లిపాటి తిరుపతిరావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, జనప్రియ కుమార్, బీరెల్లి కార్తీక్ పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుతున్నారు

బోనకల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలన చేపట్టిన 15 నెలల కా లంలో అన్ని వర్గాల ప్రజలు విసిగి పోయారని, మరల కేసీఆర్ రావాలని మా ర్పు కోరుతున్నారని మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ జడ్పీ చై ర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. మండలంలోని రావినూతల గ్రామంలో గురువారం జరిగిన బీఆర్ఎస్ మండల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదిన వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం విజయోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బంధం శ్రీనివా సరావు, బాణోతు కొండ, మల్లికార్జున్, నాగేశ్వరరావు, వేమూరి ప్రసాద్, గద్దల వెంకటేశ్వర్లు, ఇటికాల శ్రీనివాసరావు, జంగా రవి తదితరులు పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలస్వామి ఆలయ

పాలకమండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలక మండలి సభ్యులు

కల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో అత్యంత ప్రాముఖ్యత గల సంతాన వేణుగోపాలస్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమం గురువారం నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సమక్షంలో ఈ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా దారా రంగా సుధాకర్‌గుప్తా తోపాటుగా పాలక మండలి సభ్యులుగా బొప్పన శ్రీనాథ్, అజ్మీర రామకృష్ణ, వలసాల నరేంద్రబాబు, బొడ్డు పిచ్చయ్య, తోట మణి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు సౌమిత్రి రామాచార్యులు ఎంపికైనారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్ నూతన పాలక మండలి సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ నూతన పాలకమండలి చైర్మన్ రంగాతో పాటుగా సభ్యులను ఎమ్మెల్యే రాగమయి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, నాయకులు ప్రభాకర చౌదరి, యస్‌కె ఉస్మాన్, తురాబాలీ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు సమాజానికి తెలియాలి

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మానవ హక్కులను కాలరాస్తున్న తరుణంలో అందరం ఏకమై దేశ గొప్పతనం, మహనీయుల త్యాగాలు, బాపూజీ కన్న కలలు, అంబేద్కర్ రాజ్యాంగ హక్కులను సమాజానికి తెలియజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. గురువారం పెనుబల్లి జై బాపూ... జైభీమ్... జై సంవిధాన్ కార్యక్రమాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో ఉమ్మడిజిల్లాతోపాటు సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15నెలల కాలంలో రూ.800కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం ఆర్యవైశ్య కల్యాణమండపం నుంచి కార్యకర్తలతో యాత్ర నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధి 68మంది లబ్ధిదారులకు రూ.23.59లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి గురువారం పెనుబల్లిలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ, వైస్‌చైర్మన్ రాచబోయిన కోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుమర్తి విశ్వనాథ్, తహసీల్దార్ గంటా ప్రతాప్, నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, సోమరాజు సీతారామారావు, చిన్నస్వామి, చీకటి రామారావు, చీకటి చిన్ననర్సింహారావు, మాధవరెడ్డి, కరీముల్లా, మహిళ యూత్ కాం గ్రెస్ నాయకులు పాల్గొన్నారు. గణేశులపాడు హరిజనవాడ కాలనీలో సన్నబియ్యంతో తయారుచేసిన భోజనాన్ని ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ భోజనం చేశారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

తల్లాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఉపాధి హామీ పథకం కూలీలకు ఆరోగ్య కార్యకర్తలు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉదయం 11గంటల్లోపు, సాయంత్రం 4గంటల తర్వాత మాత్రమే పనులకు వెళ్లాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రత్నమనోహర్, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే గేటు వద్ద గోడ నిర్మాణం

మధిరటౌన్,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మధిర లోని పాత రైల్వేగేట్ వద్ద పాదచారుల రాకపోకలకు వీలు లేకుండా గోడ నిర్మించేందుకు రైల్వే అధికారులు గురువారం గోడ నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. ఉదయం నుంచి నాయకుల చుట్టూ తిరిగిన వ్యాపారులు చివరకు చేసేది లేక తామే రంగంలోకి దిగి పనులను అడ్డుకున్నారు. మూడో లైన్ నిర్మాణ పనులు చేపడుతుండటంతో మరికొన్ని రోజుల్లో రైల్వేగేట్ వద్ద రాకపోకలు వీలు లేకుండా నిర్మాణం చేస్తారని తెలుసుకున్న 'ఆంధ్రజ్యోతి' అండర్ పాస్ ఎన్నికల బైపాస్ అని కథనం ప్రచురించినా కదలిక లేని నాయకులు నేడు గోడ నిర్మాణ పనులు చేస్తుంటే కొన్ని రోజుల పాటు నిర్మాణ పనులు ఆపాలని రైల్వే అధికారులను కోరారు. గోడ నిర్మిస్తే అసలే అంతంత మాత్రమే సాగుతున్న తమ వ్యాపారాలు అసలే సాగవని, రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఉన్న వ్యాపారులు పనులు జరుగుతున్న దగ్గరికి వచ్చి ప్రజా ప్రతినిధుల తీరుపై నిట్టూరుస్తు చివరికి ఆందోళనకు దిగగా సిపిఎం నాయకులు వీరికి సంఘీభావం తెలిపారు.

గోడ నిర్మాణాన్ని నిలిపివేయాలి

మధిర రూరల్: మధిర పట్టణ నడిబొడ్డులో ఉన్న రైల్వేగేట్ వద్ద పూర్తిగా మూసివేసేందుకు అధికారులు గోడను నిర్మించే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని, ఆ పనులను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మధిర మండల, పట్టణ సీపీఎం నాయకులు రైల్వేగేట్ వద్దకు చేరుకొని గోడ నిర్మించేందుకు చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల, పట్టణ నాయకులు మందా సైదులు, పడకంటి మురళీ మాట్లాడుతూ రైల్వేగేట్ వద్ద గోడ నిర్మించటం వల్ల మధిర పట్టణం రెండుభాగాలుగా చీలిపోతుందన్నారు. జనాల రాకపోకలకు, వర్తక వాణిజ్య వ్యాపారాల వారికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం కావాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

కల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా బీజేపీ శ్రేణులు సమయత్తం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పిలుపు నిచ్చారు. గురువారం కల్లూరులో మండల బీజేపీ కార్యకర్తల సమావేశం గుమ్మ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు ప్రసంగిస్తూ గ్రామాల్లో బూత్ స్థాయి నుంచి కమిటీలు వేసుకొని పార్టీని పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ప్రధాని మోదీ పాలనలో బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకోవెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అమలు కాని హామీలతో ప్రజలను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను తిప్పికొడుతూ ప్రజల్లోకి తీసుకోవెళ్లాల్సిన అవసరం బీజేపీ కార్యకర్తలపై ఉందన్నారు. బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు ఈవీ రమేష్, వెంకటరామారావు, పుల్లారావు, గుండపునేని అనీల్ తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డీసీసీబీ బ్యాంక్‌లో అయ్యవారిగూడెం వ్యవసాయసహకార సంఘం ఆధ్వర్యంలో సభ్యులకు బీమా నగదును గురువారం అందించారు. సొసైటీ పరిధిలోని అయ్యవారిగూడం సహకార సంఘ సభ్యులైన నరసింహాపురం గ్రామానికి చెందిన షేక్ జాన్‌సాహెబ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. జాన్‌సాహెబ్‌కి అయ్యవారిగూడెం సహకార సంఘంలో సభ్యత్వం ఉండడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేల బీమా నగదును ఆయన భార్య హిమాంబీకి సొసైటీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ దివ్య అందించారు. ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ సంఘ సభ్యులైన జాన్‌సాహెబ్ మృతి బాధాకరమన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుదాకర్, క్యాషియర్ మౌనిక, జాని, సీఈవో మోహన్‌రావు, సొసైటీ సిబ్బంది మురళి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరోగ్యశ్రీ కార్డులు అన్ని ఆసుపత్రుల్లో చెల్లుబాటు

సత్తుపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఇళ్లు, ఇళ్లస్థలాల సాధనతో పటు అరోగ్యశ్రీ కార్డులు అన్ని ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యేలా కృషి చేస్తామని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడ్డిపాటి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం సత్తుపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో ఆ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలపై సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని, రాజీవ్ యువ వికాసం రుణాల విషయంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లప్పుడూ తవంతు తోడ్పాటును అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఫోన్‌ద్వారా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్‌ఖదీర్, చీనేని బాలకృష్ణ, రవికిరణ్, మాధవరావు, సంజీవరావు, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ తల్లి ఉత్సవాలు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతుపల్లిలో 200ఏళ్ల చరిత్ర కలిగిన అంకమ్మతల్లి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం రాత్రి రెడకప్పెర నిర్వహించారు. గుడ్లు పగులగొట్టి సొన తీసేసి అమ్మవారి కళ్లలా అలంకరించి ప్రతి ఇంటిముందు తీసుకువస్తే గ్రామస్థులు ఫలహారం చేసి అనంతరం ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. గ్రామ క్షేమం కోసం, దుష్టశక్తుల రక్షణ కోసం ఇలా గ్రామప్రభబండి గ్రామంలో ఇంటింటికి ఊరేగింపుగా వెళ్తుందని, తమ ఇళ్ల ముంగిట నీళ్లుపోసి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయానికి చేరుకుని నైవేద్యంగా సమర్పించారు. నేడు రాత్రి నుంచి గ్రామ ప్రభబండి ఊరేగింపు, 12న గండదీపాలు, రాత్రి నుంచి పెద్ద తిరునాళ్లు, తెల్లవారుజామున అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, 13న బద్దెగొర్రె, చంద్రపట్నం, సాంస్కృతిక కార్యక్రమాలతో తిరునాళ్లు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి ఆలయానికి విచ్చేసి మొక్కులు చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

కల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అరెస్టులతో ఎల్‌హెచ్‌పీఎస్ ఉద్యమాన్ని ఆపలేరని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మసోతు దశరథ్ నాయక్ అన్నారు. గురువారం కల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. లంబాడీలకు రాష్ట్ర మంత్రి వర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధన్యత కల్పించాలని కోరుతూ తాము సీఎం ఇంటిని ముట్టడించే కార్యక్రమాన్ని తలపెట్టమన్నారు. గురువారం తమ నాయకులైన కల్లూరు మండల ఎల్‌హెచ్‌పిఎస్ అధ్యక్షుడు నందు నాయక్, ప్రధాన కార్యదర్శి బానోతు రామారావులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయటం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలా అర్ధ రాత్రి అరెస్ట్ చేయటంతో తమ ఉద్యమాలను ప్రభుత్వం అపలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో లంబాడిలకు మంత్రి ఇవ్వనిచో గిరిజనులు తగిన గుణపాఠం చెప్తారని ధశరద్‌నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో మండల ఎల్‌హెచ్‌పిఎస్ అధ్యక్షుడు నందునాయక్, కార్యదర్శి రామారావులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవం



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

కల్లూరు, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని కప్పలబంధం గ్రామంలో గురువారం అంగరంగ వైభవంగా అంకమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, అభిషేకములు, అష్టలక్ష్మీవత్రం, సహస్ర కుంకుమార్చాన పూజలు నిర్వహించారు. ఈ తిరునాళ్ల మహోత్సవములు గురువారం నుంచి ఆదివారం వరకు నాలుగు రోజుల పాటుగా వైభవంగా నిర్వహించేందుకు ఆయల కమిటీ వారు అన్ని విధాలు ఏర్పాట్లు చేశారు. వేదపండితులు బైరవభట్ల నాగేంద్రశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల ఉరేగింపు (అంకసేవ) పురవీధుల్లో వైభవంగా నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ సలహాదారులు సినర్జీ క్రాప్ ప్రొటెక్షన్ కంపెనీ అధినేత కర్నాటి వెంకటరామిరెడ్డి, తల్లపురెడ్డి రత్నాలరెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు శీలం నాగిరెడ్డి, జిల్లేళ్ల బాస్కరరెడ్డి, గుర్రాల వెంకటరామిరెడ్డి, నరేంద్రరెడ్డి, సదాశివరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేడు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం...

మండల పరిధిలోని కప్పలబంధం గ్రామంలోని అంకమ్మ మహాలక్ష్మమ్మ అమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవము సందర్భంగా శుక్రవారం రాత్రి జిల్లా స్థాయిలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వహకులు తెలిపారు. 15 సంవ్సరాల లోపు గల పిల్లలు ఈ పోటీలలో పాల్గొనేందుకు అర్హులని కమిటీ వారు తమ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లాలోని పలు గ్రామాల నుంచి ఆసక్తి గల కళాకారులు ఈ పోటీలలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు.

అంకమ్మ జాతర, తిరుకల్యాణ వేడుకలు ప్రారంభం

తల్లాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలోని అంకమ్మ దేవాలయంలో గురువారం అంకమ్మజాతర, కుర్నవల్లిలోని వేంకటాచలపతి దేవాలయంలో తిరు కల్యాణ మహోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. అంకమ్మదేవాలయంలో ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ పూజా కార్యక్రమంతో జాతర ప్రారంభమైంది. భక్తులు ఆలయానికి చేరుకొని మంగళతోరణాలు కట్టారు. అనంతరం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. వేంకటాచలపతి దేవాలయంలో కూడా మంగళతోరణం, ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్లు దొడ్డా శ్రీనివాసరావు, అయిలూరి శేషిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వెంచర్‌లో అడిషనల్ కలెక్టర్ విచారణ



కొణిజర్ల, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల సమీపంలోని ఓ వెంచర్‌లో కాలిబాటను అక్రమించాడని లోకాయుక్తాలో వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఆ వెంచర్‌లో విచారణ చేపట్టారు. స్థానిక రైతులతో మాట్లాడారు. స్థానికంగా రైతులు గతంలో 15 అడుగుల డొంక ఉండేదని, ప్రస్తుతం దానిని 40 అడుగులు చేసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని, తమకు ఎటువంటి ఇబ్బందిలేదని రైతులు వివరించారు. దీనికి సంబంధించి రైతులు అభిప్రాయాలను రికార్డు చేసి సంతకాలతో తమకు పైల్ పెట్టాలని తహసీల్దార్‌ను ఆమె ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన చిన్నగోపతి గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నగోపతి గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. అనంతరం మండలంలోని బస్వాపురం గ్రామంలో గల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా అని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దార్ రాము, ఎంపీడీవో రోజారాణి, ఎంఈవో అబ్రహం, ఎంపీవో రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.